# పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY // తెలుగు దినపత్రిక

సంపుటి : 01 | సంచిక : 286 | విశాఖపట్నం | 16-7-2026 గురువారం | చీఫ్ ఎడిటర్ : ఎల్. కృష్ణరావు | పేజీలు: 8 | వెల: రూ.5/-

Volume : 01 | Issue : 286 | VISAKHAPATNAM | 16-7-2026 THURSDAY | CHIEF EDITOR: L.KRISHNA RAO | Pages:8 | Rate: Rs.5/-

Visakhapatnam, Srikakulam, Allurisitarama, Rajamahendravaram, Vijayawada, Tirupati, Anathapuram



SBI

PATHAKAM NEWS

SCAN & PAY

UPI ID: 44576280686@sbi

BHIM | UPI

yono SBI | BHIM SBI Pay

G Pay | Paytm | Pay


## నదుల అనుసంధానం చేస్తే..

# ఏపీకి కరవు ఉండదు: చంద్రబాబు



**విజయవాడ, పతాకం న్యూస్:** ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలోని కృష్ణా– గోదావరి జలాల పవిత్ర సంగమం వద్ద జలహారతి కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తుల్లో కృష్ణవేణి – గోదావరి నదుల సంగమ ప్రాంతంలో ప్రత్యేక పూజలు నిర్వహించి జలాలకు పుష్పమాల, వస్త్రాలు, పసుపు– కుంకుమ సమర్పించారు. కృష్ణా– గోదావరి పవిత్ర సంగమం వద్ద జలహారతి ఇచ్చారు. ఆపై ప్రముఖ ఇంజినీర్ కేఎల్ రావు 124వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం మాట్లాడుతూ.. ఇంజినీర్‌గా కేఎల్ రావు స్ఫూర్తి ప్రతి గ్రామానికీ తీసుకెళ్లేలా ప్రభుత్వం కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. పట్టిసీమ నుంచి గోదావరి జలాలు కృష్ణమ్మ చెంతకు చేరి ఈ డెల్టాను సస్యశ్యామలం చేస్తున్నాయన్నారు. శ్రీశైలం, నాగార్జున సాగర్‌లకు కృష్ణా నది నుంచి నీటి ప్రవాహం తగ్గిందని తెలిపారు. రైతులు పండించిన పంటలు తుఫాన్ల బారిన పడి నష్టపోతున్న దుస్థితి నుంచి రక్షించాలనే పట్టిసీమ ప్రాజెక్టు చేపట్టామని సీఎం వెల్లడించారు. శ్రీశైలం, నాగార్జున సాగర్, హీరాకుడ్, కోసీ లాంటి ప్రధానమైన డ్యామ్‌ల నిర్మాణంలో కేఎల్ రావు కీలక పాత్ర పోషించారని కొనియాడారు. ఐక్యరాజ్య సమితి తరఫున అంతర్జాతీయ జల నిపుణులుగా ఈజిప్ట్, సూడాన్ లాంటి దేశాల్లోనూ సేవలందించారన్నారు. విజయవాడలో పుట్టి ఎంపీగా ఎన్నికై ముగ్గురు ప్రధానుల వద్ద కేఎల్ రావు కేంద్రమంత్రిగా పనిచేశారని గుర్తుచేశారు. నీటి పారుదల రంగం (తరువాయి 2వ పేజీలో)



# నత్తనడకన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు!

**రణస్థలం, పతాకం న్యూస్:** రణస్థలంలో ఫ్లైఓవర్ నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. గత ఏడాది జనవరి 17 నుంచి పనులు ప్రారంభమయ్యాయి. డిసెంబరు వరకూ వేగవంతం అయ్యాయి. కానీ ఈ ఏడాది జనవరి నుంచి మందగించాయి. వచ్చే ఏడాది జూన్ నాటికి ఈ వంతెన నిర్మాణం పూర్తిచేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. కానీ ఇప్పటివరకూ 50 శాతం పనులు కూడా జరగలేదు. సదరు కాంట్రాక్ట్ సంస్థకు జాతీయ రహదారి అధికారులు సహకరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏడాది లోపు వంతెన నిర్మాణ పనులు పూర్తయ్యే సూచనలు కనిపించడం లేదు. రణస్థలంలో 4.7 కిలోమీటర్ల మేర వంతెన నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం రూ.187 కోట్లకు టెండర్లను పిలిచింది. రూ.137కోట్లకు ఒక కంపెనీ టెండరు దక్కించుకుంది. ప్రారంభంలో పనులు జోరుగా సాగాయి. పశ్చిమాసియాలో యుద్ధం ప్రారంభమైనప్పటి నుంచి కష్టాలు మొదలయ్యాయి. డీజిల్ కొరత ఏర్పడింది. రోజుకు ఇక్కడ పనులు చేసేందుకు 3 వేల లీటర్ల డీజిల్ అవసరం. కానీ 400 లీటర్లు కూడా లభించడం కష్టమవుతోందని కాంట్రాక్టరు సంస్థ ప్రతినిధులు చెబుతున్నారు. తారు సైతం అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. గతంలో ఇంధనంతో పాటు నిర్మాణ సామగ్రి కంపెనీలు అవసరమైన వాటిని ముందుగా అందించేవని.. తర్వాత డబ్బులు చెల్లించేవారమని పేర్కొన్నారు. ఇప్పుడు ముందుగా డబ్బులు చెల్లించినా.. ఇంధనం ఇవ్వడం లేదని చెబుతున్నారు. పశ్చిమాసియా యుద్ధం నేపథ్యంలో నిర్మాణ సామగ్రితోపాటు డీజిల్ ధర కూడా పెరగడంతో అదనపు భారం పడుతోందని పేర్కొంటున్నారు. టెండరు ప్రకారం నిధులు చాలవని, అంచనా వ్యయం పెంచాలని కోరుతున్నారు. మరో వైపు వంతెన నిర్మాణం చేపడుతున్న కంపెనీకి జాతీయ రహదారుల శాఖ అధికారులు సహకరించడం లేదన్న విమర్శలు ఉన్నాయి. ప్రస్తుతం (తరువాయి 2వ పేజీలో)



2లో

## ముద్రగడ పాడె మోసిన జగన్

## టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు మోక్షం ఎప్పుడు?



5లో



6లో

## కిడ్నీల్లో రాళ్లు ఏర్పడేందుకు కారణాలు ఏమిటి? ఎలా గుర్తించాలి?

## పొరుగు రాష్ట్రాలతో పోటీపడి పరిశ్రమలు తీసుకొస్తున్నాం: లోకేశ్



**కడప, పతాకం న్యూస్:** కడప జిల్లాలో దాల్మియా సిమెంట్ ప్లాంట్ విస్తరణ పనులకు పునాదిరాయి పడింది. మైలవరం మండలం చిన్నకొమెర్ల సమీపంలో దాల్మియా సిమెంట్ రూ.3,100 కోట్ల భారీ వ్యయంతో ఏర్పాటు చేస్తున్న రెండో ప్లాంట్‌కు మంత్రి లోకేశ్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడితూ వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో బ్రాండ్ ఆంధ్రప్రదేశ్ చాలా దెబ్బతిందని ధ్వజమెత్తారు. మళ్లీ అభివృద్ధి స్థాయికి తీసుకురావడానికి రెండేళ్లు అహర్నిశలు కష్టపడ్డామని తెలిపారు. లక్ష్యాలు నెరవేర్చుకునేందుకు కష్టపడి పని చేద్దామని పిలుపునిచ్చారు. దాల్మియా గ్రూప్ మూడో దశ కూడా విస్తరిస్తుందని, పొరుగు (తరువాయి 2వ పేజీలో)

## అనకాపల్లి జిల్లాలో 'అభయ' కార్యక్రమాన్ని ప్రారంభించిన హోం మంత్రి అనిత





**అనకాపల్లి, పతాకం న్యూస్:** మహిళల భద్రతను మరింత పటిష్టం చేయాలనే లక్ష్యంతో అనకాపల్లి జిల్లా పోలీసులు "మీ భద్రత –మా బాధ్యత" అనే నినాదంతో చేపట్టిన 'అభయ' కార్యక్రమాన్ని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వేంపాడు టోల్ ప్లాజా సమీపంలోని భారతి కన్వెన్షన్‌లో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్, జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు, పెద్ద సంఖ్యలో విద్యార్థినీలు, మహిళలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా హోంమంత్రి అనిత అభయ ఫిర్యాదుల బాక్స్‌ను ప్రారంభించడంతో పాటు, అభయ పోస్టర్లను ఆవిష్కరించారు. మహిళలు, విద్యార్థినులు తమ సమస్యలను నిర్భయంగా తెలియజేసేందుకు జిల్లా వ్యాప్తంగా పాఠశాలలు, కళాశాలల్లో అభయ ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేయనున్నట్లు పోలీసులు వెల్లడించారు. హోంమంత్రి అనిత మాట్లాడుతూ, మహిళల భద్రత కోసం అనకాపల్లి పోలీసులు చేపట్టిన 'అభయ' కార్యక్రమం అభినందనీయమని పేర్కొన్నారు. మహిళలకు ధైర్యాన్ని నింపడంతో పాటు, వారిలో భద్రతా భావాన్ని పెంపొందించేందుకు ఈ కార్యక్రమం ఎంతో ఉపయోగపడుతుందన్నారు. తల్లిదండ్రులు, విద్యార్థులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని, సైబర్ నేరాల (తరువాయి 2వ పేజీలో)

## సొంత డబ్బులతోనే శస్త్రచికిత్స చేయించుకున్న పవన్



**ముంబై, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన వ్యక్తిగత వైద్య ఖర్చుల విషయంలో తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారు. భుజం సర్జరీకి సంబంధించిన పూర్తి ఖర్చును ఆయన తన సొంత నిధుల నుంచే భరించారు. ఆపరేషన్‌తో పాటు ప్రయాణ ఖర్చులను కూడా ఆయనే వ్యక్తిగతంగా చూసుకున్నారు. మంత్రివర్గ సభ్యులకు అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు ప్రభుత్వ నిధుల నుంచి వైద్య ఖర్చులను రీయింబర్స్‌మెంట్ పొందే సౌకర్యం ఉంటుంది. అయినప్పటికీ, పవన్ కల్యాణ్ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోలేదు. ప్రజాధనాన్ని వ్యక్తిగత అవసరాలకు వాడకూడదన్న తన సొంత సూత్రానికి కట్టుబడి ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం.


పతాకం న్యూస్

APTEL/25/A2082

PATHAKAM NEWS TELEGU DAILY | తెలుగు దినపత్రిక

ధర్మం కోసం పోరాటం చేస్తున్నా..

అవినీతి, అక్రమాలను బయటకు తీస్తున్నా..

పతాకం న్యూస్‌కు సహకరించగలరు

సంవత్సరం చందా రూ. 2000

PATHAKAM NEWS

State Bank of India

A/c No: 44576280686

IFSC:SBIN00021297

DUVVADA BRANCH

పతాకం న్యూస్
APTEL/25/A2082
PATHAKAM NEWS TELEGU DAILY తెలుగు దినపత్రిక

## సంపాదకీయం

## రైతు దిగాలు..

తన వ్యవసాయ క్షేత్రంలో విత్తు నాటితే, అది మొల కెత్తి మొక్క ఉనికిని బాహ్య ప్రపంచానికి కనబడే టట్లు పెరుగుతున్న కొద్దీ రైతులో సంతోషం వెల్లివిరు స్తుంది. అది పెరిగే కొద్దీ దాని వైభవం చూస్తూ పొంగి పోతాడు. కానీ ఎన్నినో పుణ్యమా అని దేశవ్యాప్త రైతు ల్లో అలాంటిదేమీ కనబడుట లేదు. వర్షం వస్తుందోరాదో తెలియని ఆందోళనతో రైతు దిగాలు పడిపోయాడు. ఇతరత్రా గాలివానలు, తుఫాను బీభత్సాలవల్ల కలిగే భయో త్పాతం ఒకలా ఉంటే ఇప్పుడు చూస్తున్న ఎల్నినో క్షణ క్షణం రైతును కృంగదీస్తోంది. ఓ రెండు, మూడుమాసాల పాటుసూపర్ ఎల్నినో పేరిట మరెన్నో కష్టనష్టాలు తెచ్చి పెట్టేలాంటి సంకేతాలే ఉన్నాయి. వర్షాలు కురుస్తాయ నుకున్న మృగశిర, ఆరుద్ర కార్తెల్లో తగిన వర్షం పడ లేదు. ప్రస్తుతం పునర్వసు కార్తె కూడా శుభసంకేతాలను చూపడం లేదు. ఇదిగో వచ్చేసా యనుకున్న రుతుపవ నాలు కూడా బలహీనపడటంతో వ్యవసాయదారుని నెత్తిమీద బండపడినట్లే ఉంది. వస్తాయనుకున్న వర్షాలు రాలేదని సాగు మానాలా, రేపెపుడో వర్షాలు కురుస్తాయిలే అని ధైర్యంతో ముందుకెళ్లాలా అన్న మీమాంసల మధ్య కొందరు రైతులు ఒకడుగు ముందుకే వేయాలని నిర్ణయిం చారు. కానీ నారు మొలవక కురిసే చినుకును ధ్యానిస్తూ రైతు ఆకాశం కేసి చూస్తున్నాడు. పశ్చిమ మహాసముద్రం లో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలు అసాధారణంగా పెర గడంతో ఎల్నినో ప్రభావం బాగా బలపడుతోంది. ప్రపంచ వాతావరణ సంస్థ తాజా హెచ్చరికల ప్రకారం ఈ జులై నెల నుంచి సెప్టెంబరుల మధ్య ఎల్నినో బలీయంగా ప్రభావం చూపిస్తుంది. ఈ తరుణంలో వ్యవసాయం, తాగు నీటి వనరులు, ఆర్థిక వ్యవస్థ, ప్రజారోగ్యం, విద్యుత్ వినియోగం వంటి అన్ని రంగాలపై ప్రత్యక్ష ప్రభావం చూపుతుంది. ముందు ముందు పరిస్థి తులు ఎలా ఉంటాయో తెలియదు. ప్రస్తుతమైతే ఎల్నినో పరిస్థితులు బలపడుతున్నాయనే చెప్పాలి. నైరుతి రుతు పవనాలు, ఎల్నినో వాతావరణం ఒకేసారివస్తే మంచిదేనని కొందరు శాస్త్రజ్ఞులు చెబుతుంటారు. కానీ ఒకదానికొకటి ముడిప డని సందర్భాలు అందుకే రైతు దిక్కుతోచక సతమతమ వుతున్నాడు. ఎల్నినో ఎప్పుడెంత స్థాయిలో ప్రభావం చూపినా నవంబర్ నెలదాక వ్యవసాయం వంటి అన్ని రంగాలపై ఎంతో కొంత ప్రభావం చూపుతుంది. ఏదైనా వ్యవసాయరంగానికి ఎల్ని సవాలే. సాధారణంగా బలహీన వాతావరణ పరిస్థితులు చూడొచ్చు. ప్రధానంగా వరి, పత్తి, పప్పుధాన్యాలు, వర్షాధార పంటలుగా సాగు చేసే రైతులకు దినదినగండంలా ఉంటుంది. ఒకప్పుడు ఎల్నినో ప్రభావంతో వర్షపాతాన్ని మాత్రమే ప్రభావితం చేస్తుందనే అనుకునేవారం. కానీ ఇప్పుడు తీవ్ర ఉష్ణోగ్రత లు, కార్చిచ్చులు, నీటి కొరత ఆరోగ్య సమస్యలు, ఆహార కొరత, వీటన్నిటి కారణంగా విద్యుత్ డిమాండ్ పెరుగు దల వంటి అంశాలపై ప్రభుత్వం దృష్టి కేంద్రీకరించాల్సి ఉంటుంది. వర్షపాతం ఏమాత్రం తగ్గినా పండే పంటలపై ప్రభావం చూపుతోందన్న గాభరాతో ప్రభుత్వం రైతులకు అనేక అంశాలలో జాగ్రత్తలు పాటించమని చెబుతూనే ఉంది. భారత్లో వ్యవసాయధారిత దేశం కనుక రుతు పవనాలపై సాగు ఆధారపడి ఉంటుంది. జలాశయాల్లో నీటి నిల్వలుతగ్గితే సాగునీటి ప్రాజెక్టులపై ఒత్తిడి పెరుగు తుంది. ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తిపై ప్రతికూల పరిస్థితులు ఏర్పడతాయి. ధరలు పెరగడం, ద్రవ్యోల్బణం అధికమవడం వంటి తీవ్ర పరిణామాలు కలుగుతాయి. ఎల్నినో ప్రభావాన్ని తగ్గించుకోవడమొక్కటే మనకుశరణ్యం. జాగ్రత్తలు పాటించి ముందుచూపుతో వ్యవహరిం చాలి. అప్పుడే సంక్షోభాన్ని ఎదుర్కొని నిలబడగలం. తెలుగు రాష్ట్రాల్లో నైరుతి రుతుపవనాలు ముఖం చాటేసి చాలారోజులైంది. ఎందరో రైతులు విత్తులు నాటినా మొలకల్లేక నిరాశతో ఎదురుచూస్తున్నాడు. సాగు పనులు లేక వ్యవసాయ కూలీల జీవనోపాధికి ఇబ్బందులు ఏర్ప డ్డాయి. భూగర్భజలాలు అడుగంటి వివిధ పంటలనాట్లు కోసం సిద్ధం చేస్తున్న విత్తనాలు ఎండిపోతున్నాయి. ఈ నేపథ్యంలో ఎల్నినో ప్రభావంతో ఎన్నో జిల్లాలలో వ్యవ సాయ రంగం కుదేలైపోయింది. గ్రామీణ వ్యవస్థ బాగా దెబ్బతింది. ఈ విషయాలపై భారత్ వాతావరణ సంస్థ సెంట్రల్ వాటర్ కమిషన్ తెలంగాణ అభివృద్ధి ప్రణాళిక సొసైటీలు నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పరిణా మాలన్నీ భారత్ తోపాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణాలపై కూడా. పెద్ద ప్రమాదం జరుగుతుంది. నైరుతి రుతుపవ నాల బలహీనపడడంతో వర్షపాతం లోటు ఏర్పడింది.

## హైదరాబాద్-తిరుపతి ఉదయం విమాన టికెట్లకు భారీ డిమాండ్




**రేణిగుంట, పతాకం న్యూస్:** హైదరాబాద్ నుంచి తిరుపతికి నడిచే విమాన సర్వీసులకు ఇటీవల డిమాండ్ నెలకొంది. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తుల సౌకర్యార్థం తిరుపతి విమానాశ్రయంలో టీటీడీ శ్రీవాణి కౌంటర్‌ను ఏర్పాటు చేసింది. ఉదయం 7 నుంచి మధ్యాహ్న 2 గంటల వరకు ఈ టికెట్లు జారీచేస్తుంది. ఈ టికెట్లు పొందేందుకు ఉదయం వేళ తిరుపతికి చేరుకునేందుకు భక్తులు మొగ్గుచూపుతున్నారు. హైదరాబాదు నుంచి తిరుపతికి రోజుకు దాదాపు 8 విమాన సర్వీసులు ఉన్నాయి. అయినా ఉదయం 7:20గంటలకు వచ్చే ఇండిగో ఎయిర్‌బస్, 8:30గంటలకు వచ్చే ఎయిరిండియా సర్వీసులకే ఎక్కువ ఆదరణ లభిస్తోంది. దీంతో మొదట పరిమిత సంఖ్యలో మాత్రమే టికెట్లు కేటాయిస్తూ వచ్చిన టీటీడీ ప్రయాణికుల తాకిడి ఎక్కువ కావడంతో రోజుకు 200 టికెట్లను అదనంగా అందుబాటులోకి తెచ్చింది. శ్రీవాణి టికెట్ల కోసం వచ్చే ప్రయాణికుల రద్దీ కారణంగా ఈ విమాన టికెట్ ధరలు సైతం అమాంతం పెరుగుతున్నాయి.

## వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ముద్రగడ పద్మనాభకి ఘన నివాళులు



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** వైసీపీ జిల్లా పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాజీ మంత్రి, మాజీ పార్లమెంట్ సభ్యులు, ప్రముఖ ప్రజానేత ముద్రగడ పద్మనాభంకి ఘనంగా నివాళులర్పిస్తూ శ్రద్ధాంజలి కార్యక్రమం అనంతరం 02 నిమిషాలు మౌనం పాటించారు . నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కేకే రాజు మాట్లాడుతూ, ముద్రగడ పద్మనాభం మరణం రాష్ట్ర రాజకీయాలకు, సమాజానికి, ముఖ్యంగా ప్రజా ఉద్యమాలకు తీరని లోటని అన్నారు.ఆయన మాట్లాడుతూ, రైతులు, కార్మికులు, వెనుకబడిన వర్గాల హక్కుల కోసం ముద్రగడ పద్మనాభం జీవితాంతం పోరాడిన మహనీయుడని కొనియాడారు. ప్రభుత్వాలు ఏవైనా ప్రజలకు అన్యాయం చేసినప్పుడు వాటిని ప్రశ్నిస్తూ, ఎత్తిపోతల పథకాలు, భూసేకరణ, రైతుల సమస్యలు వంటి అనేక ప్రజా సమస్యలపై ఆయన నిరంతరం ఉద్యమాలు నిర్వహించారని గుర్తుచేశారు. ముఖ్యంగా కాపు ఉద్యమ నాయకుడిగా ఆ సామాజిక వర్గానికి రాజకీయ, సామాజిక న్యాయం సాధించేందుకు చేసిన పోరాటాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజల పక్షాన నిలబడి పోరాడాలనుకునే వారికి ఆయన జీవితం ఆదర్శప్రాయమని అన్నారు. ముద్రగడ పద్మనాభం నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా, ఒకసారి పార్లమెంట్ సభ్యుడిగా ప్రజలకు సేవలందించారని తెలిపారు. వ్యక్తిగత ఆస్తులు, వందల ఎకరాల భూములను కూడా ప్రజా ఉద్యమాల కోసం త్యాగం చేసిన మహోన్నత వ్యక్తిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారని కొనియాడారు. అలాగే, ఆయన ఇంటికి వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆత్మీయంగా ఆదరించి, భోజనం పెట్టి పంపించే గొప్ప మనసున్న నాయకుడని కేకే రాజు గుర్తుచేశారు. అలాంటి పోరాట యోధుడు తెలుగు ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని అన్నారు. ముద్రగడ పద్మనాభం ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన కేకే రాజు, ఆయన కుటుంబ సభ్యులకు, ముఖ్యంగా కుమారుడు గిరీష్‌కు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సమన్వయకర్తలు మొల్లి అప్పారావు, నియోజకవర్గ పరిశీలకులు పేడాడ రమణి కుమారి, పార్టీ కార్యాలయం పర్యవేక్షకులు రవి రెడ్డి పార్టీ , సీనియర్ నాయుకులు తాడి జగన్నాధ్ రెడ్డి , జాన్ వెస్లీ, పేర్ల విజయ్ చంద్ర, జివి రవి రాజు, శ్రీదేవి వర్మ , సనపల రవింద్ర భరత్, కర్రి రామి రెడ్డి , బొండ ఉమామహేశ్వరరావు , పిలా ప్రేమ్ కిరణ్ , బోని శివ రామ కృష్ణ , రెయ్యి వెంకటరమణ , ఆల్ఫ్ కృష్ణ , సుమన్ యాదవ్ , బిపిఎన్ కుమార్ జైన్ , దేముడు మాస్టర్ , పులగం శ్రీనివాస్ రెడ్డి , దల్లి రామ కృష్ణ రెడ్డి , బంగారు భవాని , సురేష్ ,చంద్ర శేఖర్ , లక్ష్మణ్ , పార్వతి , దమయంతి , పేర్ల రాము తదితరులు పాల్గొన్నారు.

## ముద్రగడ పాడె మోసిన జగన్



**కాకినాడ, పతాకం న్యూస్:** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం భౌతిక కాయానికి వైసీపీ అధినేత జగన్ నివాళులర్పించారు. ముద్రగడ కుటుంబ సభ్యులను ఓదార్చి ధైర్యం చెప్పిన జగన్, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ముద్రగడ పార్థివ దేహానికి రాజకీయ ప్రముఖులు, ప్రజలు, అభిమానులు భారీ సంఖ్యలో తరలివచ్చి నివాళులర్పిస్తున్నారు. కాసేపటి క్రితం ముద్రగడ అంత్యక్రియలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ముద్రగడ పాడెను జగన్, వైసీపీ కీలక నేత బొత్స సత్యనారాయణ మోశారు.

(మొదటిపేజీ తరువాయి)

## నత్తనడకన ఫ్లైఓవర్ నిర్మాణ పనులు

అడపాదడపా వర్షాలు పడుతున్నాయి. వంతెన నిర్మాణం చూస్తే అస్తవ్యస్తంగా ఉంది. తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. కొంతమంది ప్రాణాలు కోల్పోయారు. అందుకే రణస్థలం అంటేనే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వంతెన నిర్మాణ పనులతో స్థానికులు కూడా తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అటువైపు ఉన్నవారు.. ఇటువైపు రావాలంటే కిలోమీటర్ల మేర ప్రయాణం చేయాల్సి వస్తోంది. ఒకవైపు మండల కార్యాలయాలు, మరోవైపు పోలీస్‌స్టేషన్‌తో పాటు బ్యాంకులు ఉన్నాయి. ఈ క్రమంలో రాకపోకలు సాగించినప్పుడు నరకయాతన పడుతున్నారు. ప్రస్తుతానికి మండల కేంద్రంలోని ప్రధాన ప్రాంతంలో స్తంభాలు పునాదులు దాటాయి. అటు ఇటుగా మిగతా ప్రాంతాల్లో ఇంకా స్తంభాల పనులు ప్రారంభం కాలేదు. గడువు చూస్తే ఇంకా ఏడాది కూడా లేదు. వీలైనంత త్వరగా పనులు పూర్తిచేసేలా ఎమ్మెల్యే, ఎంపీలు.. జాతీయ రహదారి అధికారులు, కాంట్రాక్టు సంస్థతో మాట్లాడాలని స్థానికులు కోరుతున్నారు.

## ప్రారంభించిన హోంమంత్రి అనిత

పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సైబర్ నేరాల నియంత్రణ కోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం శక్తి యాప్, శక్తి టీమ్స్ ద్వారా మహిళలకు రక్షణ కల్పిస్తోందని పేర్కొన్న హోంమంత్రి, ఎవరైనా వేధింపులకు గురైతే వెంటనే 112కు కాల్ చేయాలని సూచించారు. చట్టాలు కఠినంగా ఉన్నాయని, యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి చదువుపై దృష్టి పెట్టాలని హితవు పలికారు. పిల్లల ప్రవర్తనపై తల్లిదండ్రులు నిరంతరం నిఘా ఉంచాలని, చదువే జీవితంలో ఉన్నత స్థాయికి తీసుకెళ్తుందని అన్నారు. ప్రతి విద్యార్థి ఒక స్పష్టమైన లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానిని సాధించే దిశగా కృషి చేయాలని సూచించారు. అనకాపల్లి జిల్లాలో ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ డ్రోన్ల ద్వారా కూడా పర్యవేక్షణను విస్తృతంగా చేపడుతున్నామని హోంమంత్రి తెలిపారు. మహిళల భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, ప్రతి పాఠశాల, కళాశాలలో అభయ ఫిర్యాదుల బాక్సులు ఏర్పాటు చేసి భద్రతా వ్యవస్థను మరింత బలోపేతం చేస్తామని స్పష్టం చేశారు.

## ఏపీకి కరువు ఉండదు: చంద్రబాబు

జల విద్యుత్ ఉత్పత్తి లాంటి అంశాలపై పనిచేసి దేశానికి సేవలందించారన్నారు. గోదావరి ప్రాంతంలో ధవళేశ్వరం, కృష్ణానదిపై కృష్ణాబ్యారేజీని సర్ ఆర్థర్ కాటన్ నిర్మాణం చేశారని.. ఇది ఏపీని దేశానికే అన్నపూర్ణగా మార్చిన నిర్ణయమని సీఎం చెప్పుకొచ్చారు. కేఎల్ రావు ఈ ప్రాజెక్టులను ఆధునీకరించి డెల్టాను సస్యశ్యామలం చేశారన్నారు. శివరామకృష్ణయ్య, కేఎల్ రావు తర్వాత ఆంధ్రప్రదేశ్ సాగునీటి రంగంపై ఆలోచించిన వ్యక్తి ఎన్టీఆర్ అని.. సాగునీటి రంగాన్ని తీర్చిదిద్దటంలో వీరంతా స్ఫూర్తి అంటూ వెల్లడించారు. వాగులు, వంకలు, నీటి ఊటలు కూడా ఇప్పుడు అడుగంటిపోయాయని, భూగర్భజలాలను పెంచేందుకు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. రాయలసీమ ప్రాంతం ఎడారిగా మారిపోకుండా చర్యలు చేపట్టామని చంద్రబాబు తెలిపారు. గోదావరి- కావేరి అనుసంధానించాలని కేఎల్ రావు ప్రతిపాదించారని గుర్తుచేశారు. నదుల అనుసంధానం జరిగితే భారత్‌కు అద్భుతమైన అవకాశాలు వస్తాయన్నారు. గంగా-కావేరీ అనుసంధానం కోసం మాజీ ప్రధాని వాజ్‌పేయి హయాంలో ఓ టాస్క్‌ఫోర్సును ఏర్పాటు చేశారన్నారు. 2014లో విభజన తర్వాత బస్సులోనే బస చేసి కృష్ణా డెల్టాకు న్యాయం చేసేలా పట్టిసీమ ప్రారంభించామని ఆనాటి సంగతులను గుర్తుచేశారు. 80 టీఎంసీల గోదావరి నీటిని తీసుకువచ్చి కృష్ణా డెల్టాను సస్యశ్యామలం చేశామన్నారు. నీల వర్ణంలోని కృష్ణా జలాలు, అరుణ వర్ణంలోని గోదావరి జలాలు కలిసి ఈ ప్రాంతంలో బంగారం పండించాయని ఆనందం వ్యక్తం చేశారు. గోదావరి నుంచి కనీసం సగటున ఏడాదికి 2 వేల టీఎంసీల నీరు సముద్రంలోకి వెళ్తోందన్నారు. 2027 మార్చి నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి జాతికి అంకితం చేస్తామని... రాష్ట్రానికి జీవనాడిగా మారుస్తామని స్పష్టం చేశారు. పట్టిసీమ వట్టిసీమ అని అవహేళన చేశారని.. ప్రాజెక్టు దండగ అన్నారని... ఇప్పుడు ఆ నీరే డెల్టాను కాపాడుతోందని సీఎం తెలిపారు. ఆ నీరే రాకపోతే కృష్ణా డెల్టా పరిస్థితి ఏమిటన్నది అంతా ఆలోచించాలన్నారు. 2015-2025 వరకూ 450 టీఎంసీల నీటిని తరలించామని.. పట్టిసీమకు రూ.1300 కోట్లు మాత్రమే ఖర్చు చేశామన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో హైటెక్ సిటీ నిర్మిస్తే దండగన్నారని.. ధైర్యంగా ముందుకు వెళ్లబట్టే ఐటీకి కేంద్రంగా హైదరాబాద్ నిలబడిందని చెప్పుకొచ్చారు. ఇప్పుడు అమరావతిని కూడా అద్భుతమైన నగరంగా నిర్మిస్తుంటే కొందరు అడ్డుపడుతున్నారని మండిపడ్డారు. ప్రతిపక్షంలోని కొందరు.. రైతుల్ని రెచ్చగొట్టి సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారని సీఎం చంద్రబాబు ఆరోపణలు గుప్పించారు. ఈ కార్యక్రమానికి మంత్రులు నిమ్మల రామానాయుడు, అనగాని సత్యప్రసాద్, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్, ఎంపీ కేశినేని శివనాథ్, మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు తదితరులు హాజరయ్యారు.

## పొరుగు రాష్ట్రాలతో పోటీపడి పరిశ్రమలు తీసుకొస్తున్నాం: లోకేశ్

రాష్ట్రాలతో పోటీపడి పరిశ్రమలు తీసుకొస్తున్నామని మంత్రి లోకేశ్ తెలిపారు. అన్ని రంగాల్లో ముందుండాలనే అహర్నిశలు కష్టపడుతున్నామన్నారు. యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడమే ప్రధాన లక్ష్యమని లోకేశ్? పేర్కొన్నారు. ఈ ప్లాంట్ విస్తరణ వల్ల కొత్తగా మరో 700 మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయన్నారు. సిమెంట్ ఉత్పత్తి రంగంలో దాల్మియా గ్రూప్ బలమైనది. దాల్మియా గ్రూప్ ఏపీ అభివృద్ధిలో ఎప్పటినుంచో భాగమైంది. ఈ సంస్థ పెట్టుబడుల వల్ల వేల మందికి ఉపాధి లభిస్తోంది. అనుమతులు వేగంగా ఇవ్వడం వల్లే ఏపీకి భారీగా పెట్టుబడులు వస్తున్నాయి. భారత్‌కు వచ్చే పెట్టుబడుల్లో 25 శాతం ఏపీకే వస్తున్నాయి. ఏపీ వృద్ధిరేటు 10 నుంచి 15 శాతానికి పెరిగింది.’ అని లోకేశ్ తెలియజేశారు. దేశంలోనే నాలుగో అతిపెద్ద సిమెంట్ తయారీ సంస్థ దాల్మియా భారత్ గ్రూప్ కడప జిల్లాలో తన వ్యాపార విస్తరణకు శ్రీకారం చుట్టింది. మైలవరం మండలం చిన్నకొమెర్ల సమీపంలో చేపట్టనున్న రెండో ప్లాంట్ పనులకు మంత్రి లోకేశ్ భూమిపూజ చేశారు. ముందుగా ప్లాంట్ ఆవరణకు చేరుకున్న మంత్రి లోకేశ్‌కు దాల్మియా భారత్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్, సీఈవో పునీత్ దాల్మియా, కంపెనీ ప్రతినిధులు ఘనస్వాగతం పలికారు. అనంతరం దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ అడ్మినిస్ట్రేషన్ బిల్డింగ్?లో రోబో ల్యాబ్, సెంట్రల్ కంట్రోల్ రూమ్?ను మంత్రి సందర్శించారు. వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్, ఏవీని వీక్షించారు. కార్మికులను పలకరించి వారితో కలిసి సెల్ఫీ దిగారు. అనంతరం పునీత్ దాల్మియాతో కలిసి దాల్మియా సిమెంట్ భారత్ లిమిటెడ్ లైన్-2 విస్తరణ పనులకు మంత్రి భూమిపూజ చేశారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ప్రస్తుతం దాల్మియా సిమెంట్ ఏడాదికి 2.5 మిలియన్ టన్నుల క్లింకర్, 3.6 మిలియన్ టన్నుల సిమెంట్ ఉత్పత్తి చేస్తోంది. కొత్తప్లాంట్ విస్తరణతో క్లింకర్ సామర్థ్యం 6.1 మిలియన్ టన్నులు, సిమెంట్ ఉత్పత్తి 9.6 మిలియన్ టన్నులకు చేరనుంది. ప్రస్తుతం నడుస్తున్న ప్లాంట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా 950 మంది ఉపాధి పొందుతున్నారు. ఈ ప్లాంట్ విస్తరణతో కొత్తగా మరో 700 మందికి ఉపాధి లభిస్తుంది. అనుబంధ పరిశ్రమల్లో కూడా ఉపాధి అవకాశాలు ఏర్పడే అవకాశం ఉంది. దాల్మియా సంస్థ రెండో దశ విస్తరణ పనులను అత్యుత్తమ ప్రమాణాలతో గ్రీన్ ఇండస్ట్రీగా మార్చేందుకు కృషి చేయనుంది. ఈ పరిశ్రమకు అవసరమైన విద్యుత్‌లో ఏకంగా 80 శాతాన్ని పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే సేకరించనున్నారు. ఫ్యాక్టరీ ప్రాంగణంలో 33 శాతం విస్తీర్ణంలో గ్రీన్ బెల్ట్ అభివృద్ధి చేయడంతో పాటు, నీటి వృథాను అరికట్టేందుకు జీరో లిక్విడ్ డిశ్చార్జ్ వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నారు.

# పిండ్రంగి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో గణనీయంగా పెరిగి ప్రవేశాలు



**కె.కోటపాడు, పతాకం న్యూస్:** ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లలను చేర్పించడానికి తల్లిదండ్రులు ఆసక్తి చూపుతున్నారడానికి మండలంలోని పిండ్రంగి ఆదర్శ ప్రాథమిక పాఠశాలను ఒక ఉదాహరణగా చెప్పాలి. గత విద్యా సంవత్సరంతో పోల్చుకుంటే ప్రస్తుత విద్యా సంవత్సరంలో 55 శాతానికిపైగా విద్యార్థులు పెరిగారు. ఒకటో తరగతి మినహా మిగిలిన నాలుగు తరగతుల్లో చేరిన వారంతా ప్రైవేటు పాఠశాలల నుంచి రావడం విశేషం. పిండ్రంగి ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 2025-26 విద్యా సంవత్సరంలో మొత్తం 67 మంది విద్యార్థులు వున్నారు. వీరిలో ఒకటో తరగతిలో 19 మంది, రెండో తరగతిలో 19 మంది, మూడో తరగతిలో 18 మంది, నాలుగో తరగతిలో 11 మంది కలిపి మొత్తం 67 మంది విద్యార్థులు వున్నారు. ఐదో తరగతిలో ఒక్కరు కూడా లేరు. నాలుగో తరగతికి చెందిన 11 మందిలో పది మంది విద్యార్థులు ఈ ఏడాది ప్రభుత్వ గురుకుల పాఠశాలల్లో సీట్లు రావడంతో టీసీలు తీసుకొని వెళ్లిపోయారు.

దీంతో గత విద్యా సంవత్సరం నుంచి ప్రస్తుత విద్యా సంవత్సరంలో పాఠశాలలో మిగిలింది. 57 మంది మాత్రమే. ఈ నేపథ్యంలో ఉపాధ్యాయులు గ్రామంలో ఇంటింటికి వెళ్లి, ప్రభుత్వ పాఠశాలలో పథకాల అమలు, విద్యా బోధన గురించి విస్తృతంగా ప్రచారం చేశారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రైవేటు పాఠశాలల్లో మాన్పించి, ప్రభుత్వ పాఠశాలలో చేర్పించడం మొదలుపెట్టారు. ఈ ఏడాది ఒకటో తరగతిలో 19 మంది, రెండో తరగతిలో ఏడుగురు, మూడో తరగతిలో ఐదుగురు, నాలుగో తరగతిలో నలుగురు, ఐదో తరగతిలో ఒకరు చేరారు. పాత విద్యార్థులు 57 మంది, కొత్త విద్యార్థులు 36 మంది (వీరిలో 30 మంది ప్రైవేటు పాఠశాలల నుంచి వచ్చారు) కలిపి ప్రస్తుతం 93 మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి పాఠాలు బోధించడానికి హెచ్ఎంతో కలిపి ఐదుగురు టీచర్లు ఉన్నారు. ఈ సందర్భంగా ఎంఈవో-1 కె.సత్యనారాయణ, ఎంఈవో-2 డీవీడీ ప్రసాద్, క్లస్టర్ కాంప్లెక్స్ హెచ్ఎం ఎ.శేఖర్, గ్రామ పెద్దలు పాఠశాలను సందర్శించారు. హెచ్ఎం బి.శ్రీరామ్మూర్తి, ఉపాధ్యాయులు పి.నాయుడుబాబు, బి.ధనలక్ష్మి, కె.బంగారయ్య, పి.రమేశ్‌లను అభినందించారు కొత్తగా చేరిన విద్యార్థులతో గ్రూప్ ఫొటో దిగారు.

## రైల్వేస్టేషన్‌లో వాహనాల పార్కింగ్‌పై పోలీసులు దృష్టి..



**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖపట్నం రైల్వే స్టేషన్‌లో వాహనాల పార్కింగ్‌పై పోలీసులు దృష్టి సారించారు. ప్లాట్‌ఫారం నంబరు 1 వద్ద, రెండో నంబరు ప్లాట్‌ఫారం గేటు నంబరు 4 వద్ద ద్విచక్ర వాహనాలకు అవసరమైన స్థలం కేటాయించారు. గంటల లెక్కన చార్జీలు వసూలు చేస్తున్నారు. అయితే చాలా మంది స్టేషన్‌కు వచ్చి ఇప్పుడే వచ్చేస్తామంటూ నో పార్కింగ్ జోన్‌లో వాహనాలు నిలిపేసి వెళ్లిపోతున్నారు. ఇలాంటి వారికి కొద్దిరోజులుగా అధికారులు రూ.500 జరిమానా వేస్తున్నారు. ముందు ఆయా వాహనాలను అక్కడి నుంచి తీసుకువెళ్లడానికి వీల్లేకుండా ఇనుపగొలుసులు వేస్తున్నారు. వాహన యజమాని వచ్చాక రూ.500 జరిమానా రాసి, ఆ మొత్తం చెల్లించి రశీదు తీసుకువస్తేనే వాహనం ఇస్తున్నారు. నో పార్కింగ్‌లో వాహనాలు లేకుండా చేయడానికి ఈ విధానం అనుసరిస్తున్నామని రైల్వే పోలీస్ వర్గాలు తెలిపాయి. జ్ఞానాపురం స్టేషన్ వైపు కూడా విశాలమైన పార్కింగ్ సదుపాయం కల్పించారు.

## ఈ- పంట నమోదు ప్రక్రియ వేగవంతం చేయాలి



**పాడేరు, పతాకం న్యూస్:** రైతులకు మేలు చేసే ఈ-పంట నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులను కలెక్టర్ టి.నిషాంతి ఆదేశించారు. ఐటీడీఏ పీవో ఆదిత్యవర్మతో కలిసి జిల్లాలో ఈ-పంట నమోదుపై వ్యవసాయానుబంధ శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ముఖ్యమంత్రి ఆదేశాలతో జిల్లాలో సహజ పద్ధతులతో సాగవుతున్న పంటలను విధిగా ఈ-పంటలో నమోదు చేయాలన్నారు. గతం నుంచి ఈ-పంటలో నమోదవుతున్న పంటలతో పాటు సాగవుతున్న కాఫీ పంట మొత్తాన్ని ఈ- పంటలో నమోదు చేయాలని ఆమె ఆదేశించారు. ప్రధానంగా కాఫీ పంటలను నమోదు చేయడం ద్వారా భవిష్యత్తులో కాఫీని ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేసేందుకు ఒక డేటాబేస్ ఉంటుందన్నారు. అలాగే జిల్లాలోని ప్రతి సాగు భూమిని విధిగా పరిశీలించి, ప్రతి పంటను కచ్చితంగా ఈ-పంటలో నమోదు చేయాలని, ఈ క్రమంలో ఏ పంటను విస్మరించవద్దని ఆమె సూచించారు. ఈ విషయంతో వ్యవసాయశాఖాధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరచాలన్నారు. ఈ- పంట నమోదుపై జిల్లా అధికారులు ప్రతి రోజు పర్యవేక్షణ చేస్తుంటారని, సెప్టెంబరు 15 నాటికి జిల్లాలో సాగవుతున్న అన్ని పంటలు ఈ- పంటలో నమోదు కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నందు, ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్టు మేనేజర్ ఎల్.భాస్కరరావు, మైక్రో ఇరిగేషన్ పీడీ రహీమ్, కాఫీ ఏడీ కాఫీ సీనియర్ లైజన్ అధికారి ఎస్.రమేశ్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## ప్రజలకు దగ్గరగా పబ్లిసిటీకి దూరంగా న్యూ పోర్ట్ సీఐ కామేశ్వరరావు




**గాజువాక, పతాకం న్యూస్:** విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి సంకల్ప దీక్షతో చేస్తున్న ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని న్యూ పోర్ట్ లా అండ్ ఆర్డర్ సిఐగా పనిచేస్తున్న టి. కామేశ్వరరావు తూచ తప్పకుండా పాటిస్తున్నారు. న్యూ పోర్ట్ స్టేషన్ కు వస్తున్న ఫిర్యాదులను తమదైన శైలిలో పరిష్కరిస్తూ ప్రజలకు దగ్గర నుంచి మన్నలను పొందుతున్నారు. గత కొంతకాలంగా స్టేషన్ పరిసరాలను రూపురేఖలు మారుస్తూ పోలీస్ స్టేషన్ అంటే ప్రజల్లో భయం పోగొట్టే విధంగా చేస్తూ ప్రజలందరి గుండెల్లో చోటు సంపాదించుకున్నారు. విధి విధానాల్లో నియమాలు దాటకుండా ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులోనే ఉంటూ ప్రతి ఫిర్యాదు దారుడు ఇచ్చిన ఫిర్యాదులను తానే స్వయంగా స్వీకరిస్తూ బాధిత కుటుంబాల బాధను ఎంతో ఓపికగా వింటూ బాధితులకు భరోసా కల్పిస్తూ న్యాయం చేయడంలో తనదైన పాత్రను పోషిస్తూ అందరూ మనసులను దోస్తున్నారు. పబ్లిసిటీకి దూరంగా ఉంటూ ప్రజలకు నిస్వార్థంగా సేవలందిస్తున్నారని ప్రజల నుంచి మంచి సీఐగా గుర్తింపు పొందిన వ్యక్తి సిఐ టి కామేశ్వరరావు. న్యూ పోర్ట్ పోలీస్ స్టేషన్ కు వచ్చిన ఫిర్యాదుదారులను స్టేషన్ సిబ్బంది ఫ్రెండ్లీ పోలీసు విధానాన్ని అలవర్చుకోవాలని ఎప్పటికప్పుడు చెప్పుతూ అందరితోనూ ఫ్రెండ్లీ నేచర్ తో ఉద్యోగాలు చేయిస్తున్నారు. పోలీస్ అంటే ప్రజల్లో భయాన్ని పొగడుతూ పోలీస్ వ్యవస్థపై నమ్మకాన్ని కల్పించే విధంగా సీఐ పనిచేస్తున్నారని పలువురు కొనియాడుతున్నారు. ఇటువంటి సీఐను ఎన్నడూ చూడలేదని ఇలాంటి పోలీస్ అధికారి వలన పోలీస్ వ్యవస్థ పై మరింత గౌరవం పెరుగుతుందని పలువురు ప్రజలు ప్రజాసంఘాల నాయకులు అభిప్రాయపడుతున్నారు

## అంతర్రాష్ట్ర రహదారి ఎప్పటికి పూర్తయ్యేనో?



**సీలేరు, పతాకం న్యూస్:** పాడేరు ఆర్అండ్‌బీ డివిజన్ పరిధిలోని సీలేరు- పాలగెడ్డ అంతర్రాష్ట్ర రహదారి గోతులతో అధ్వానంగా ఉంది. పలుచోట్ల చెరువును తలపించేలా గోతులు ఉండడంతో వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఆంధ్రా, ఒడిశా, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ రాష్ట్రాలను కలిపే అంతర్రాష్ట్ర రహదారి ఇది. ముఖ్యంగా సీలేరు జల విద్యుత్ ప్రాజెక్టుకు వెళ్లే మార్గమిది. ఈ మార్గం గుండా నాలుగు రాష్ట్రాలకు చెందిన వాహనాలు, ప్రయాణికులతో పాటు సీలేరు కాంప్లెక్సులోని జల విద్యుత్ కేంద్రాల సందర్శనకు, ధారకొండ ధారాలమ్మ అమ్మవారి ఆలయానికి నిత్యం వేలాది మంది రాకపోకలు సాగిస్తుంటారు. అలాగే తెలంగాణ, ఉభయ గోదావరి జిల్లాల నుంచి ఆంధ్రా కశ్మీర్‌గా పేరొందిన లంబసింగి, అరకులోయ ప్రాంతాలకు పర్యాటకులు వాహనాలపై ఈ మార్గంలోనే ప్రయాణిస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యత ఉన్న ఈ రహదారి ఎన్నో ఏళ్లు నిర్లక్ష్యానికి గురైంది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఈ రహదారి పునర్నిర్మాణానికి రూ.18.5 కోట్లు మంజూరు చేసింది. ఆర్వీనగర్ నుంచి పాలగెడ్డ వరకు మూడు రీచ్‌లుగా పనులు విభజించింది. గత ఏడాది అక్టోబరు నెలలో కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి కేవలం ఆర్వీనగర్ నుంచి నూతివంద వరకు గల మొదటి రీచ్‌లో మాత్రమే పనులను పూర్తి చేశారు. రెండవ రీచ్‌లో సప్పర్ల రేయిన్‌గేజ్ నుంచి ధారాలమ్మ ఆలయం వరకు, మూడవ రీచ్‌లో సీలేరు నుంచి పాలగెడ్డ వరకు రహదారి పనులు చేపట్టాల్సి ఉండగా, రెయిన్‌గేజ్ వద్ద కొంత మేర మెటల్ వేసి వదిలేశారు. పశ్చిమాసియాలో యుద్ధం నేపథ్యంలో తారుకు కొరత ఏర్పడి పనులు నిలిపివేసినట్టు కాంట్రాక్టర్ చెబుతున్నారు. వాస్తవానికి అంచనా వ్యయం రూ.18.5 కోట్లకు అదనంగా రూ.4 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసినట్టు ఆర్అండ్‌బీ అధికారులు తెలిపారు. కానీ పనులు మాత్రం పునఃప్రారంభం కాలేదు. కాగా గత పది రోజులుగా ఈ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు సీలేరు- పాలగెడ్డ రహదారిలోని గోతుల్లో వర్షపు నీరు నిలిచిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి కనీసం తాత్కాలికంగా గోతులను పూడ్చాలని వాహనచోదకులు కోరుతున్నారు.

## ముద్రగడ మరణం కాపు జాతికి తీరని లోటు: ఎమ్మెల్యే పంచకర్ల



**పెందుర్తి, పతాకం న్యూస్:** అనారోగ్య సమస్యలతో హైదరాబాదులో చికిత్స పొందుతూ తుది శ్వాస విడిచిన కాపు ఉద్యమ నేత, మాజీమంత్రి ముద్రగడ పద్మనాభం మరణం కాపు జాతికి ముఖ్యంగా ఆయన కుటుంబానికి తీరని లోటు అని జనసేన విశాఖపట్నం రూరల్ జిల్లా అధ్యక్షులు, పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు అన్నారు. బుధవారం కాకినాడ జిల్లా కిర్లంపూడి లో ముద్రగడ పద్మనాభం పార్థివ దేహానికి పార్టీ నాయకులతో కలిసి ఆయన ఘన నివాళులర్పించారు. ముద్రగడ కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అనంతరం మీడియాతో పంచకర్ల రమేష్ బాబు మాట్లాడుతూ కాపు జాతి ఎదుగుదల కోసం అహర్నిశలు పాటుపడిన ముద్రగడ పద్మనాభం విలువలతో కూడిన రాజకీయాలు చేస్తూ, అది తరహా జీవితాన్ని కొనసాగించారని పేర్కొన్నారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో కాపులను ఏక తాటి పైకి తీసుకొచ్చేందుకు ముద్రగడ పద్మనాభంఎంతో కృషి చేశారని, మరెన్నో పోరాటాలు చేశారని వివరించారు. ముద్రగడ పద్మనాభం గారు చేసిన సేవలను కాపులు ఎప్పటికీ మరిచిపోలేరని పేర్కొన్నారు. వ్యక్తిగతంగా ఆయన నష్టపోయినా కాపు జాతి కోసం పోరాటం చేస్తూనే ఉన్నారనే తెలిపారు. ఆయన పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నట్లు ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు తెలియజేశారు.

## సిద్ధమైన రెవెన్యూ కాంప్లెక్స్



**చోడవరం, పతాకం న్యూస్:** ఏళ్ల తరబడి సొంతగూడు లేక ఇరుకు భవనాల్లో నడుస్తున్న రెవెన్యూ, ట్రెజరీ కార్యాలయాలకు త్వరలోనే వసతి కష్టాలు తీరనున్నాయి. గతంలో టీడీపీ హయాంలో భవన నిర్మాణం చేపట్టగా, తరువాత వచ్చిన గత ప్రభుత్వం ఐదేళ్లపాటు గాలికొదిలేసింది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ప్రభుత్వం కోటిన్నర రూపాయలు మంజూరు చేయడంతో నిర్మాణ పనులు పునఃప్రారంభం అయ్యాయి. దాదాపు 90 శాతం పనులు పూర్తయ్యాయి. మిగిలిన పనులను కూడా త్వరలోనే పూర్తిచేసి, శ్రావణమాసంలో ప్రారంభించడానికి అధికారులు కృషి చేస్తున్నారు. చోడవరంలోని రెవెన్యూ కార్యాలయం భవనాలను సుమారు 25 ఏళ్ల క్రితం మావోయిస్టులు (పీడబ్ల్యూజీ నక్సలైట్లు) బాంబులు పెట్టి పేల్చివేశారు. దీంతో భవనం బాగా దెబ్బతిన్నది. కొంతకాలంపాటు శిథిల భవనంలోనే రెవెన్యూ కార్యాలయాన్ని కొనసాగించారు. వర్షాకాలంలో ఇబ్బందులు కలుగుతుండడంతో వెలుగు కార్యాలయానికి చెందిన స్త్రీశక్తి 2016లో టీడీపీ అధికారంలో వున్నప్పుడు భవన నిర్మాణం కోసం ఎంపీ ల్యాడ్స్ నుంచి రూ.50 లక్షలు మంజూరయ్యాయి. భవన నిర్మాణ పనులు ప్రారంభించి, రెండు అంతస్థులకు పిల్లర్లు, శ్లాబు వేశారు. మిగిలిన పనులకు నిధులు చాలకపోవడంతో ముందుకు కదలలేదు. 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల పాటు అధికారంలో వున్న వైసీపీ ప్రభుత్వం.. చోడవరంలో అసంపూర్తిగా వున్న రెవెన్యూ కార్యాలయం భవన నిర్మాణానికి నిధులు ఇవ్వలేదు. రెండేళ్ల క్రితం కూటమి అధికారంలోకి రావడంతో ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొల్లు రవీంద్ర, కలెక్టర్ విజయకృష్ణన్‌లతో మాట్లాడి, తహశీల్దారు కార్యాలయం భవన నిర్మాణం పూర్తిచేయడానికి నిధులు మంజూరు చేయించాలని కోరారు. దీంతో వారిద్దరూ చోడవరం వచ్చి అసంపూర్తిగా వున్న భవనాన్ని పరిశీలించారు. ఇది జరిగిన కొద్ది రోజులకే రూ.1.2 కోట్లు మంజూరు చేశారు. దీంతో పనులు పునఃప్రారంభించారు. గోడల నిర్మాణం, ప్లాస్టరింగ్ పనులు పూర్తయ్యాయి. ప్రస్తుతం పుట్టీ పనులు జరుగుతున్నాయి. తరువాత ఫ్లోరింగ్, విద్యుత్, ప్లంబింగ్ తదితర పనులు పూర్తిచేసి, శ్రావణ మాసంలో ప్రారంభోత్సవం చేయించాలని స్థానిక ఎమ్మెల్యే రాజు భావిస్తున్నారు. జీ ప్లస్ 2 తరహాలో నిర్మించిన ఈ భవనంలో రెండో అంతస్థులో సమావేశాల నిర్వహణకు పెద్ద హాలు నిర్మించారు. మొదటి అంతస్థులో రెవెన్యూ కార్యాలయం, కిందన (గ్రౌండ్ ఫ్లోర్) సబ్ ట్రెజరీ కార్యాలయం నిర్వహిస్తారని సమాచారం. దీంతో ఒకేసారి రెవెన్యూ, సబ్‌ట్రెజరీ కార్యాలయాలకు వసతి సమస్య తీరనున్నది.

## పైనాపిల్ ధర పతనం



**అరకు, పతాకం న్యూస్:** మన్యంలో ప్రస్తుతం పైనాపిల్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. అయితే ఊహించని విధంగా ధర పతనం కావడంతో గిరి రైతులు ఆవేదన చెందుతున్నారు. గతవారం వరకు ఒక్కో కాయ హోల్‌సేల్ ధర రూ.18, రిటైల్ ధర రూ.25 చొప్పున పైనాపిల్ విక్రయాలు జరగగా, ప్రస్తుతం టోకుగా రూ.13 నుంచి రూ.15లు, రిటైల్‌గా రూ.20 చొప్పున విక్రయిస్తున్నారు. అయితే ఈ ఏడాది పంట దిగుబడి ఆశాజనకంగా ఉండడంతో మార్కెట్‌కు అధికంగా కాయలు రావడంతో డిమాండ్ తగ్గింది. దీంతో ధర పతనమైందని రైతులు, వర్తకులు తెలిపారు. ఏజెన్సీలో పాడేరు, జి.మాడుగుల, చింతపల్లి, జీకేవీధి, అరకులోయ మండలాల్లో సుమారుగా 600 ఎకరాల్లో పైనాపిల్ తోటల పెంపకాన్ని గిరిజన రైతులు చేపడుతున్నారు. జిల్లా కేంద్రం పాడేరు మండలం వంట్లమామిడి, సలుగు, దేవాపురం, ఐనాడ పంచాయతీల పరిధిలో పదుల సంఖ్యలోని గిరిజన రైతులు వాటి పెంపకం చేపడుతున్నారు. వాటిని స్థానికంగా గ్రామాల్లో, వారపు సంతల్లో విక్రయిస్తూ ఆదాయం పొందుతున్నారు. అయితే ఎటువంటి మార్కెటింగ్ సదుపాయం లేదు. దీంతో మైదాన ప్రాంతానికి చెందిన వర్తకులు సైతం ఏజెన్సీ ప్రాంతానికి వచ్చి రైతుల నుంచి వాటిని కొనుగోలు చేసుకుని చోడవరం, అనకాపల్లి, విశాఖపట్నం, నర్సీపట్నం, తుని ప్రాంతాల్లోని మార్కెట్లలో విక్రయిస్తున్నారు. మార్కెటింగ్ పరంగా తమకు ఎటువంటి తోడ్పాటు లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో సంతల్లో వర్తకులకు విక్రయించడం, మిగిలిన వాటిని రోడ్ల పక్కన దుకాణాలు పెట్టుకుని పర్యాటకులు, ప్రయాణికులకు అమ్మకాలు చేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## సెంట్రల్ జైలులో జీవిత ఖైదీ మృతి

**విశాఖపట్నం, పతాకం న్యూస్:** విశాఖ కేంద్ర కారాగారంలో జీవిత ఖైదు అనుభవిస్తున్న ఖైదీ అనారోగ్యంతో మృతిచెందినట్టు ఆరిలోవ సీఐ శ్రీనివాసరావు తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా పార్వతీపురం పట్టణంలోని రెల్లివీధికి చెందిన సొండి చిన అప్పలస్వామి (62) హత్యా నేరంలో ముద్దాయిగా రుజువు కావడంతో 2016 ఆగస్టులో కోర్టు జీవిత ఖైదు విధించింది. ఈమేరకు విశాఖ సెంట్రల్ జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. గత ఏడాది పక్షవాతం రావడంతో కేజీహెచ్‌లో చికిత్స అందించారు. ఆరోగ్యం కుదుట పడడంతో తిరిగి జైలుకు తరలించారు. గత ఏడాది జూన్‌లో కిడ్నీ వ్యాధికి గురవడంతో మళ్లీ కేజీహెచ్‌లో చికిత్స అందించారు. ఈ క్రమంలో మార్చి 6న ఇతడికి కోర్టు మూడు నెలల బెయిల్ ఇచ్చింది. గడువు ముగియడంతో ఈనెల ఆరో తేదీన తిరిగి జైలుకు వచ్చాడు. కాగా అస్వస్థతకు గురై నిద్రిస్తున్న బెడ్‌పైనే విగతజీవిగా మారాడు. ఉదయం ఆరు గంటల సమయం లో గుర్తించిన జైలు సిబ్బంది కేజీహెచ్‌కు తరలించగా, వైద్యులు పరీక్షించి అప్పటికే మృతిచెందినట్టు నిర్ధారించారు. మృతదేహానికి అధికారుల సమక్షంలో పోస్టుమార్టం నిర్వహించి, బంధువులకు అప్పగించారు. కాగా మృతుడికి వివాహమైన ఇద్దరు కుమార్తెలున్నారు.

# పోలీసుల దర్యాప్తులో సంచలన విషయాలు

## కుమారుడు చేసిన ప్రమాదాన్ని కప్పిపుచ్చేందుకు మాజీ మంత్రి అప్పలరాజు భారీ స్కెచ్ వేసినట్లు గుర్తించిన పోలీసులు



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** దానయ్య అనే నిరుపేద ప్రాణాన్ని బలిగొనడమే కాకుండా, ఆ నేరాన్ని మరొకరిపై నెట్టి చట్టం కళ్లుగప్పాలని చూసిన పలాస వైసీపీ నేత, మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కుట్రలు పోలీసుల దర్యాప్తులో బట్టబయలయ్యాయి. తన కుమారుడు సీదిరి ఆరవ్ చేసిన రోడ్డు ప్రమాదంలో ఓ అమాయక గౌర్రెల కాపరి ప్రాణాలు కోల్పోగా.. ఆ నేరం నుంచి కొడుకును తప్పించుకునేందుకు అప్పలరాజు సాక్ష్యాధారాలను తారుమారు చేసేందుకు యత్నించారు. ఒక అమాయకుడ్ని డమ్మీగా పెట్టి కేసును తప్పుదోవ పట్టించాలని చేసిన ప్రయత్నాలను పోలీసులు సాంకేతిక ఆధారాలతో (సీసీటీవీ ఫుటేజీలు, కాల్ డేటా) బెడిసికొట్టేలా చేశారు. ఈ నెల 10వ తేదీ రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో పలాస మున్సిపాలిటీ పరిధిలోని పాత ఎన్‌హెచ్–5 రోడ్డులో ఇండస్ట్రియల్ ఏరియా జంక్షన్ వద్ద చోటుచేసుకున్న ప్రమాదానికి సంబంధించి ఎఫ్ఐఆర్, రిమాండ్ రిపోర్టులో పోలీసులు పొందుపరిచిన పూర్తి సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. ఉన్నతాధికారుల ఆదేశాలతో జూలై 12న ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ ఈ దర్యాప్తును చేపట్టారు. సీసీటీవీ ఆధారాలు: అక్కుపల్లి జంక్షన్ వద్ద ఉన్న శ్రీనివాస ఫిల్లింగ్ స్టేషన్ సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించగా.. రాత్రి 21.30:14 గంటల సమయంలో బైక్ నడిపింది ఆరవ్ అని స్పష్టంగా రికార్డయింది. అలాగే ప్రమాదంలో గాయపడిన ఆరవ్.. డాక్టర్ బాలకృష్ణ ఆసుపత్రిలో చికిత్స పొందినట్లు అక్కడి ఫుటేజీలు ధ్రువీకరించాయి. కాల్ డేటా (సీడీఆర్‌ఎస్): ప్రమాదం జరిగిన రాత్రి 21:34:01 గంటలకు ఆరవ్ నుంచి సిద్ధార్త్ కు కాల్ వెళ్లినట్లు, వారు 22 సెకెన్ల పాటు మాట్లాడుకున్నట్లు తేలింది. ఆ సమయంలో ఆరవ్ ఫోన్ సిగ్నల్ (టవర్ ఐడీ : 405854101బి00001) ప్రమాద స్థలంలో ఉండగా, సిద్ధార్థ్ ఫోన్ సిగ్నల్ జీఎంఈ కాలనీలో ఉన్నట్లు సాంకేతికంగా నిర్ధారణ అయింది. పోలీసులు ఈ కేసులో కైజోల గ్రామానికి చెందిన బత్తిన విజయ్(22), నరసన్నపేట మండలం జమ్ము గ్రామానికి చెందిన మోయ పవన్ కుమార్ నాయుడు (34)లను సాక్షులుగా విచారించారు. అలాగే సోంపేట మండలం ఎకువూరు విలేజ్ వార్డ్ అడ్మిన్ సెక్రటరీ చక్రధారి, కంచిలి మండలం గోకర్ణపురం గ్రామానికి చెందిన వార్డ్ వెల్ఫేర్ సెక్రటరీ తరిపిల మురళీ సమక్షంలో ఆధారాలు, పంచనామా నమోదు చేశారు. సిద్ధార్థ్ వాంగ్మూలం మేరకు ప్రమాదంలో ధ్వంసమైన ఆరవ్ సెల్‌ఫోన్‌ను కూడా పోలీసులు సీజ్ చేశారు. దర్యాప్తులో అసలు నిజాలు బయటపడటంతో సెక్షన్ 106(1) స్థానంలో కఠినమైన నాన్-బెయిలబుల్ సెక్షన్లు 105 (హత్యకాని నేరపూరిత మానవహననం), 61(2), 238, 240, 242, 249, 49 బీఎన్ఎస్‌లను జోడిస్తూ కోర్టులో మెమో దాఖలు చేశారు. జూలై 13న ప్రధాన నిందితుడు సీదిరి ఆరవ్ (ఏ1)ను రాత్రి 19:15 గంటలకు, సిద్ధార్త్ (ఏ2)ను రాత్రి 20:30 గంటలకు అరెస్ట్ చేశారు. ఆరవ్ అరెస్టు సమాచారాన్ని అతని పెద్దనాన్న సీదిరి త్రినాథ్‌కు, సిద్ధార్త్ అరెస్టు సమాచారాన్ని అతని తండ్రి సురేంద్ర నారాయణ త్యాడికి అందజేశారు. అనంతరం పలాస ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు నిర్వహించి 15 రోజుల జ్యుడిషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరుపరిచారు. ఈ కుట్రకు ప్రధాన సూత్రధారి అయిన మాజీమంత్రి అప్పలరాజు (ఏ3) అరెస్టు ఇంకా పెండింగ్ లో ఉందని, తదుపరి విచారణ కొనసాగుతోందని కాశీబుగ్గ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ తమ రిమాండ్ రిపోర్టులో న్యాయస్థానానికి స్పష్టం చేశారు.

# ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి అమెజాన్ డేటా సెంటర్ మైలురాయి: రేవంత్‌రెడ్డి



**హైదరాబాద్, పతాకం న్యూస్ :** ఫ్యూచర్ సిటీని ప్రపంచంలోనే అత్యాధునిక నగరంగా తీర్చిదిద్దాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. అమెజాన్ డేటా సెంటర్ ఏర్పాటు ఫ్యూచర్ సిటీ అభివృద్ధికి కీలక మైలురాయిగా నిలుస్తుందని, దీనివల్ల మరిన్ని పెట్టుబడులు, అంతర్జాతీయ పరిశ్రమలు రాష్ట్రానికి వచ్చే అవకాశాలు పెరుగుతాయని చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శంకుస్థాపన చేసిన సందర్భంగా మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఫ్యూచర్ సిటీలో ఫార్చ్యూన్–500 కంపెనీలను ఆహ్వానిస్తున్నామని రేవంత్ తెలిపారు. గతేడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్‌కు 108 దేశాల నుంచి పరిశ్రమలు పాల్గొన్నాయని గుర్తు చేశారు. 2034 నాటికి తెలంగాణను ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చడమే లక్ష్యమన్నారు. 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దతామని పేర్కొన్నారు. 2047 నాటికి దేశం 30 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఎదగాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యంలో తెలంగాణ వాటా 10 శాతం ఉండేలా కృషి చేస్తామని అన్నారు. ఈ లక్ష్యాల సాధనకు భారీ పెట్టుబడులు, మౌలిక సదుపాయాలు, ఉపాధి అవకాశాలు అవసరమని, అందుకే 'తెలంగాణ రైజింగ్' విధానాన్ని తీసుకొచ్చామని చెప్పారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధి కోసం మంత్రులు, అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. హైదరాబాద్‌ను కాలుష్య రహిత నగరంగా మార్చేందుకు నగరంలోని పరిశ్రమలను దశలవారీగా తరలిస్తామని, మెట్రో విస్తరణ చేపడతామని సీఎం వెల్లడించారు. డీజిల్ తో నడిచే ఆర్టీసీ బస్సులను నగరం వెలుపలికి తరలించి, వాటి స్థానంలో ఎలక్ట్రిక్ బస్సులను ప్రవేశపెట్టే దిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నగరంలో ఎలక్ట్రిక్ వాహనాలు కొనుగోలు చేసే వారికి జీరో ట్యాక్స్ విధించే నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. మూసీ నదిని పూర్తిగా ప్రక్షాళన చేసి కాలుష్య రహితంగా మారుస్తామని, మెట్రో విస్తరణ, మూసీ పునరుద్ధరణ, పరిశ్రమల తరలింపుతో కూడిన ప్రాంతాన్ని 'కోర్ అర్బన్ రీజియన్ (క్యూర్)'గా అభివృద్ధి చేస్తామని వివరించారు. ఈ ప్రాంతాన్ని భవిష్యత్తులో సేవల రంగానికి అనుగుణంగా పునర్నిర్మిస్తామని చెప్పారు. అలాగే ఔటర్ రింగ్ రోడ్డు వెలుపల నుంచి రీజినల్ రింగ్ రోడ్డు వరకు 10 కిలోమీటర్ల పరిధిని తయారీ పరిశ్రమల (మ్యాన్యుఫ్యాక్చరింగ్) జోన్‌గా అభివృద్ధి చేస్తామని వెల్లడించారు.

# స్మార్ట్ కిచెన్ల నిర్ణయం ఉపసంహరించుకోవాలి



**కదిరి, పతాకం న్యూస్:** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల సమస్యల పరిష్కారం, కనీస వేతనాల అమలు, స్మార్ట్ కిచెన్ల విధానాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 31న శ్రీ సత్యసాయి జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శులు బాబ్ జాన్, ముస్తాక్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇప్పటి వరకు పాఠశాలల వద్దనే మధ్యాహ్న భోజనం వండి విద్యార్థులకు అందిస్తున్నారని, ఇప్పుడు ప్రభుత్వం 25 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో స్మార్ట్ కిచెన్లు ఏర్పాటు చేసి అక్కడి నుంచి భోజనం సరఫరా చేసే విధానాన్ని తీసుకురావడం సరైంది కాదన్నారు. తొలి దశలో 155 స్మార్ట్ కిచెన్లను ఒక్కొక్కటి రూ.55 లక్షల వ్యయంతో నిర్మించనున్నట్లు ప్రభుత్వం ప్రకటించిందని తెలిపారు. ఈ పథకాన్ని ప్రైవేట్ స్వచ్ఛంద సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం పాఠశాలలలోనే తాజాగా వండి విద్యార్థులకు భోజనం అందించాలని సూచించిన విషయాన్ని గుర్తు చేశారు. స్మార్ట్ కిచెన్ల పేరుతో విద్యార్థులకు వేడి, పౌష్టికాహారం అందకుండా చేసే నిర్ణయాన్ని ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే మెనూ ఛార్జీలు పెంచడం, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు గౌరవప్రదమైన వేతనాలు చెల్లించడం, వంటగదులు లేని పాఠశాలల్లో వెంటనే వంటగదులు నిర్మించడం వంటి డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఈ సమస్యల పరిష్కారం కోసం జూలై 31న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద నిర్వహించే ధర్నాలో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.

# వంశధార కాలువకు గండి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** జిల్లాలో ప్రధాన సాగునీటి వనరు.. వంశధార ప్రధాన ఎడమ కాలువకు గండిపడింది. సారవకోట మండలం గుమ్మపాడు, అక్కివలస పరిధిలో (16వ కిలోమీటరు సమీపంలో) వేకువజామున గండి పడడంతో సంబంధిత అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వంశధార ప్రధాన ఎడమ కాలువ.. నరసన్నపేట డివిజన్‌లో 55.75 కిలోమీటర్ల వరకు విస్తరించి ఉంది. అక్కడ నుంచి 104.835 కిలోమీటర్ల వరకు టెక్కలి డివిజన్ పరిధిలో ఉంది. నరసన్నపేట డివిజన్ పరిధిలో నిర్వహణ నిధులు సుమారు రూ.కోటి ఖర్చు చేశారు. గత ఏడాది కూడా డీఎంఎఫ్ నిధులు కొంతమేరకు ఆ ప్రాంతంలో వెచ్చించారు. అయినా వంశధార ప్రధాన ఎడమకాలువకు గండి తప్పలేదు. నరసన్నపేట డివిజన్ పరిధిలో వంశధార అధికారులు డిస్ట్రిబ్యూటరీ నెట్‌వర్క్‌కు ఇచ్చిన ప్రాధాన్యత ప్రధాన కాలువకు ఇవ్వలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. 2,430 క్యూసెక్కుల సాగునీరు విడుదలకు అవకాశం ఉన్నా ,809 క్యూసెక్కులను అధికారులు గొట్టాబ్యారేజీ నుంచి ఎల్‌ఎంసీ వైపు విడిచిపెట్టారు. కాగా కాలువ గట్టు బలహీనంగా ఉండడంతో.. అక్కివలస సమీపంలో పడిన గండి మూలంగా ఒక్కసారిగా ప్రధాన ఎడమకాలువ వెంబడి వచ్చే సాగునీటికి బ్రేక్ పడింది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. సుమారు ఐదు మీటర్లు వరకు గండిపడి ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. ఈ గండి ప్రభావంతో ఎడమకాలువలో మూడు మీటర్లు ఎత్తుగా వస్తున్న నీరు ప్రస్తుతం 1.5మీటర్లకు పడిపోయింది. వంశధార ప్రధాన ఎడమ కాలువకు గండిపడిన విషయం తెలుసుకున్న మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు, కలెక్టర్ స్వప్నిల్ దిన్కర్ పుండ్కర్ ఆ శాఖ అధికారులపై మండిపడ్డారు. నీటిపారుదల శాఖ అధికారులు ఏమి చేస్తున్నారు. లస్కర్లు ఉన్నారా, లేదా అన్నది ధ్వజమెత్తారు. యుద్ధప్రాతిపదికన గండి పూడ్చాలని మంత్రి అచ్చెన్న ఆదేశించారు. సాగునీటి సరఫరాకు అంతరాయం లేకుండా పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. కాలువల నిర్వహణ, బలహీన ప్రాంతాల గుర్తింపు, ముందస్తు మరమ్మతులు, నిరంతర తనిఖీలు చేపట్టడంలో అధికారులు విఫలం కావడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని తెలిపారు. ఇలాంటి ఘటనలు పునరావృతమైతే బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కాగా బుధవారం నాటికి గండి పూడ్చేలా చర్యలు తీసుకుంటామని వంశధార ఎస్ఈ జి.రామచంద్రరావు తెలిపారు. ఈ గండి ప్రభావంతో అన్ని ఓటీలు ఓపెన్ చేశామని, బండింగ్ పటిష్ఠ పనులకు చర్యలు తీసుకుంటామన్నారు. మరోవైపు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి వంశధార ఈఈ మురళీమోహన్‌తో ఫోన్‌లో మాట్లాడి యుద్ధప్రాతిపదికన గండిని పూడ్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

# ప్రభుత్వాలను ఎదిరించి నిలిచిన ధీశాలి ముద్రగడ: వెల్లంపల్లి



**విజయవాడ, పతాకం న్యూస్:** మాజీ మంత్రి, కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం మృతిపై విజయవాడ పశ్చిమ నియోజకవర్గ వైసీపీ కార్యాలయంలో సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ముద్రగడ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ మంత్రి వెలంపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ, చిన్న వయసులోనే రాజకీయాల్లోకి వచ్చి నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రెండు సార్లు మంత్రిగా సేవలందించిన గొప్ప నేత ముద్రగడని ప్రశంసించారు. ప్రభుత్వాలను ఎదిరించి నిలిచిన ధీశాలి అని, ఎక్కడా లొంగిపోని మనస్తత్వం ఆయనదని కొనియాడారు. కాపు రిజర్వేషన్ల కోసం పోరాడిన ముద్రగడపై గతంలో అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. అప్పట్లో ముద్రగడను పలకరించడానికి వచ్చిన చిరంజీవి, దాసరి నారాయణరావులను ఎయిర్‌పోర్ట్ నుంచే వెనక్కి పంపడం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ముద్రగడకు జరిగిన అన్యాయంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ ఎందుకు మాట్లాడటం లేదని నిలదీశారు. ముద్రగడ పద్మనాభం ఆశయాలు, ఆలోచన విధానాన్ని వైసీపీ ముందుకు తీసుకెళుతుందని వెలంపల్లి స్పష్టం చేశారు. ఈ సంతాప సభలో వైసీపీ కార్యకర్తలు, నాయకులు పాల్గొన్నారు. ముద్రగడ మరణం తెలుగు రాష్ట్రాల రాజకీయాలకు, సామాజిక ఉద్యమాలకు తీరని లోటని అందరూ వ్యాఖ్యానించారు.

# నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం



**పలాస, పతాకం న్యూస్:** అర్హత ఉన్న ప్రతి నిర్వాసితుడికీ న్యాయం చేస్తామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష భరోసా ఇచ్చారు. ఈ మేరకు మధ్యాహ్నం స్థానిక టీడీపీ కార్యాలయంలో కాశీబుగ్గ ఆర్వోబీ నిర్వాసితులకు ఇళ్ల పట్టాల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ పురుషోత్తపురం సబ్‌డివిజన్‌లో మొత్తం 98 మంది నిర్వాసితులకు ప్రస్తుతం పట్టాలు పంపిణీ చేశామని తెలిపారు. మిగిలిన వారికి త్వరగా ఇవ్వాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజల అభివృద్ధి కోసం చేపట్టిన ప్రాజెక్టుల వల్ల నిర్వాసితులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకొని న్యాయం చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ అప్పలరాజు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పీరుకట్ల విఠల్‌రావు, బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి లొడగల కామేశ్వరరావుయాదవ్, ఏఎంసీ చైర్మన్ మల్లా శ్రీనివాస్, జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షుడు టంకాల రవిశంకర్‌గుప్తా, గాలి కృష్ణారావు, గురిటి సూర్యనారాయణ, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, ఎం.నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

# పారిశ్రామిక అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ వ్యవస్థ బలోపేతం: మంత్రి గొట్టిపాటి



**అమరావతి, పతాకం న్యూస్:** వాతావరణ హెచ్చుతగ్గుల వల్ల రాష్ట్రంలో ప్రస్తుతం రోజుకు 280 మిలియన్ యూనిట్ల విద్యుత్ వినియోగం జరుగుతోందని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ వెల్లడించారు. ప్రభుత్వం ముందుస్తు ప్రణాళికలతో వ్యవహరిస్తూ ఇటువంటి క్లిష్ట పరిస్థితులను సైతం ధీటుగా అధిగమిస్తోందని ఆయన స్పష్టం చేశారు. "ట్రూ డౌన్" తగ్గించిన ఏకైక ప్రభుత్వం: గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిన వ్యవస్థను ముఖ్యమంత్రి చంద్రబాబు తన సుదీర్ఘ అనుభవంతో అనతికాలంలోనే గాడిలో పెట్టారన్నారు. గాలి వేగం కారణంగా అక్కడక్కడా తాత్కాలిక ఇబ్బందులు తలెత్తినా, క్షేత్రస్థాయి సిబ్బంది వెంటనే స్పందించి సమస్యలు పరిష్కరిస్తున్నారని తెలిపారు. విద్యుత్ రంగంలో శాశ్వత పరిష్కారం కోసం ట్రాన్స్?కో బలోపేతానికి విస్తృత చర్యలు చేప్పట్టామని మంత్రి వివరించారు. ట్రాన్స్?మిషన్ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తూ, భారీగా కొత్త ట్రాన్స్?ఫార్మర్లు, సబ్ స్టేషన్ల నిర్మాణం చేపట్టినట్లు పేర్కొన్నారు. దేశ చరిత్రలో "ట్రూ అప్" ఉంది కానీ, "ట్రూ డౌన్" ద్వారా భారాన్ని తగ్గించిన ఏకైక ప్రభుత్వం తమదేనని గొట్టిపాటి రవికుమార్ అన్నారు. గత రెండేళ్లు విద్యుత్ ఛార్జీలు పెంచకుండానే విజయవంతంగా మూడో ఏడాదిలోకి అడుగుపెట్టామన్నారు. రాబోయే రోజుల్లోనూ ఛార్జీలు పెంచబోమని భరోసానిచ్చారు. రాష్ట్రానికి పెద్దఎత్తున వస్తున్న పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాన్ని వేగవంతం చేశామన్నారు. ప్రస్తుతం విద్యుత్ శాఖకు సంబంధించి రూ.6 వేల కోట్లు విలువైన వివిధ ప్రాజెక్టు పనులు వేర్వేరు దశల్లో పురోగతిలో ఉన్నాయని తెలిపారు. నిర్ణీత కాలపరిమితిలోగా అవసరం మేరకు అన్ని ప్రాంతాల్లో సబ్‌స్టేషన్‌ల నిర్మాణం పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఎక్కడైనా స్థానికంగా ఇబ్బందులు ఉంటే, అక్కడి స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో నిరంతరం సమన్వయం చేసుకుంటూ సమస్యలు పరిష్కరిస్తున్నట్లు మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. మరోవైపు ప్రభుత్వం విద్యుత్ వినియోగదారులకు తీపి కబురు చెప్పనుంది. వరుసగా రెండో ఏడాది కూడా విద్యుత్ ఛార్జీలను తగ్గించనుంది. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ. 940.07 కోట్ల మేర ఛార్జీల తగ్గింపును చేపట్టబోతోంది. విద్యుత్ పంపిణీ సంస్థలు (డిస్కామ్‌లు) రాష్ట్ర విద్యుత్ నియంత్రణ కమిషన్ (ఏూాజు=జ)కి వినతి పత్రాలు దాఖలు చేశాయి. అన్ని విధాలుగా పరిశీలించి ఈ తగ్గింపు కింద వినియోగదారుల బిల్లులను ఎంత తగ్గించాలనే దానిపై కమిషన్ నిర్ణయం తీసుకుంటుంది. 2024–25లో డిస్కమ్‌లు రూ.924 కోట్ల మేర ఛార్జీల తగ్గింపును చేపట్టాయి. ఎన్నికల సమయంలో విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీలు విధించబోమని ప్రభుత్వం హామీ ఇచ్చింది. దానికి అనుగుణంగా అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో విద్యుత్ వినియోగదారులపై అదనపు ఛార్జీలు విధించకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంది. ఐదేళ్లలో ట్రూ–అప్, ఇంధన సర్‌ఛార్జ్, విద్యుత్ టారిఫ్ పేరిట వినియోగదారులపై వైఎస్సార్సీపీ ప్రభుత్వం రూ. 32,166 కోట్ల భారాన్ని మోపింది.

## ఇద్దరు పిల్లలతో సహా తల్లి అనుమానాస్పద మృతి





**వినుకొండ, పతాకం న్యూస్:** ముక్కుపచ్చలారని ఇద్దరు బిడ్డలు సహా ఓ తల్లి అనుమానాస్పద రీతిలో మృతి చెందింది. బిడ్డలను చంపి తల్లి ఆత్మహత్య చేసుకుందని భర్త తరపు బంధువులు చెబుతున్నా.. ఆమె అంత పిరికిది కాదని మృతురాలి బంధువులు చెబుతున్నారు. పల్నాడు జిల్లా వినుకొండ మండలం విఠంరాజుపల్లిలో ఈ విషాదం చోటుచేసుకుంది. స్థానికులు, పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన నక్కా భారతి (24), సునీల్‌రెడ్డి దంపతులకు తేజేశ్‌రెడ్డి(6) హేమనాథరెడ్డి(4) అనే ఇద్దరు కుమారులు ఉన్నారు. భారతి మూడేళ్ల వయసులో ఉండగా తన తల్లిదండ్రులను కోల్పోయింది. దీంతో ఆమెను మేనమామ నక్కా నాగిరెడ్డి పెంచి, వారి పెదనాన్న కొడుకైన సునీల్‌రెడ్డికిచ్చి వివాహం చేశారు. ప్రస్తుతం ఇద్దరు పిల్లలతో భారతి దంపతులు అన్యోన్యంగా జీవిస్తున్నారు. ఈ నేపథ్యంలో.. ఏమి జరిగిందో ఏమోగానీ.. మంగళవారం ఇద్దరు పిల్లలతో కలిసి భారతి ఇంట్లోనే ఆత్మహత్య చేసుకుంది. 'మేము పరమేశ్వరుని దగ్గరకు వెళ్తున్నాం, ఎలాంటి ఒత్తిళ్లూ లేవు' అంటూ భారతి రాసినట్లు ఉన్న ఓ సూసైడ్‌నోట్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నివేదిక ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని సీఐ ప్రభాకరరావు తెలిపారు. పిల్లలకు భారతి విషమిచ్చి తాను కూడా విషం తాగి చనిపోయిందని కొందరు, దిండుతో చిన్నారులను చంపి ఫ్యాన్‌కు ఉరివేసుకుందని మరికొందరు చెబుతున్నారు. ఈ ఘటన ఆత్మహత్యగా ప్రచారంలోకి రాగా, మృతురాలి కుటుంబ సభ్యులు అభ్యంతరం వ్యక్తం చేస్తూ విలేకరుల సమావేశం నిర్వహించారు. ఇది ఆత్మహత్య కాదని, భర్త సునీల్‌రెడ్డి, అతడి తల్లిదండ్రులే పక్కా పథకం ప్రకారం విషప్రయోగం చేసి ముగ్గుర్నీ హత్య చేశారని ఆరోపించారు. సూసైడ్ లేఖలో ఉన్న రాత భారతిది కాదని మృతురాలి అన్న యర్రం తిరుపతిరెడ్డి స్పష్టం చేశారు. తన చెల్లి ఆత్మహత్య చేసుకునేంత పిరికిది కాదని, ముందే ముగ్గుర్నీ చంపేసి, ఆపై తప్పుదారి పట్టించేందుకు ఉరివేసినట్లు నాటకమాడుతూ ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని ఆరోపించారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.

## అత్యాధునిక హంగులతో మంగళగిరి రైల్వే స్టేషన్... 17న ప్రారంభించనున్న ప్రధాని మోడీ




**మంగళవారం, పతాకం న్యూస్:** ఆంధ్రప్రదేశ్‌లోని గుంటూరు జిల్లా మంగళగిరి రైల్వే స్టేషన్ అత్యాధునిక హంగులతో ప్రయాణికులకు అందుబాటులోకి రానుంది. పునరుద్ధరించిన ఈ స్టేషన్‌ను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ నెల 17న వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు. కేంద్ర ప్రభుత్వ 'అమృత్ భారత్ స్టేషన్ పథకం' కింద సుమారు రూ.12.56 కోట్ల వ్యయంతో ఈ స్టేషన్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఈ ఆధునీకరణ పనుల్లో భాగంగా పాత స్టేషన్ భవనాన్ని పునరుద్ధరించడంతో పాటు, నూతనంగా రెండో ప్రవేశ మార్గాన్ని నిర్మించారు. ఇందులో అత్యాధునిక బుకింగ్ కార్యాలయం, వెయిటింగ్ హాల్స్, వీఐపీ లాంజ్ వంటి సదుపాయాలు కల్పించారు. స్టేషన్ ముఖద్వారం, విశాలమైన ప్రవేశ మార్గం, ప్లాట్‌ఫారమ్ సర్ఫేసింగ్, ఆధునిక మరుగుదొడ్లు, సౌకర్యవంతమైన సీటింగ్, స్పష్టమైన సూచికలు (సైనేజీలు), ఆకర్షణీయమైన ల్యాండ్‌స్కేపింగ్‌తో స్టేషన్ రూపురేఖలను పూర్తిగా మార్చేశారు. దివ్యాంగుల సౌకర్యార్థం రెండు లిఫ్టులు, ర్యాంపులు, టాక్టైల్ పాత్‌వేలు, ప్రత్యేక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. ప్లాట్‌ఫారమ్ 1, 4లపై నూతనంగా షెల్టర్లను నిర్మించారు. వీటితో పాటు పార్కింగ్ ప్రాంతం, పాదచారుల మార్గాలు, వీధి దీపాలు వంటి మౌలిక వసతులను మెరుగుపరిచారు. స్థానిక సంస్కృతిని ప్రతిబింబించేలా అద్భుతమైన కళాకృతులతో స్టేషన్ ప్రాంగణాన్ని అలంకరించారు. రాజధాని అమరావతి ప్రాంతానికి నేరుగా సేవలందించే ఎన్ఎస్‌జీ-4 కేటగిరీ స్టేషన్‌గా మంగళగిరి ఎంతో కీలకమైనదని రైల్వే అధికారులు తెలిపారు. ఈ ఆధునీకరణ ద్వారా ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు అందడమే కాకుండా, రైల్వే కార్యకలాపాల సామర్థ్యం కూడా గణనీయంగా పెరుగుతుందని వారు పేర్కొన్నారు.ల

## తిరుమల వెంకన్న భక్తులకు టోకరా వేస్తున్న టీటీడీ మాజీ ఉద్యోగి అరెస్ట్

**తిరుపతి, పతాకం న్యూస్:** శ్రీవారి దర్శన టికెట్లు, సేవా టికెట్లు, వసతి గదులు ఇప్పిస్తానని భక్తులను నమ్మించి మోసాలకు పాల్పడుతున్న టీటీడీ మాజీ ఉద్యోగిని పోలీసులు అరెస్ట్ చేశారు. బెంగళూరుకు చెందిన రెండు కుటుంబాల నుంచి రూ. 3.20 లక్షలు వసూలు చేశాడన్న ఆరోపణలపై తిరుమల టూ టౌన్ పోలీసులు మంగళవారం నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తిరుపతికి చెందిన టి. అరుణ్ కుమార్ (26) గతంలో టీటీడీలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేసేవాడు. విధుల్లో అక్రమాలకు పాల్పడటంతో అధికారులు అతడిని తొలగించారు. అయినప్పటికీ, టీటీడీలో తనకు పలుకుబడి ఉందని నమ్మిస్తూ భక్తుల నుంచి నగదు వసూలు చేయడం మొదలుపెట్టాడు. 2023లో కూడా ఇటువంటి మోసం కేసులోనే అతను అరెస్టయ్యాడని, అయినా తన ప్రవర్తనలో మార్పు రాలేదని పోలీసులు వెల్లడించారు. తిరుమల టూ టౌన్ సీఐ శ్రీరాములు మాట్లాడుతూ.. నిందితుడి బ్యాంకు ఖాతాలను పరిశీలించగా, గత ఏడాది కాలంలో సుమారు రూ. 85 లక్షల మేర లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. నిందితుడి నుంచి రూ. 99,000 నగదు, ఒక మొబైల్ ఫోన్, మూడు బ్యాంకు పాస్‌బుక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ మోసగాడి చేతిలో ఇంకా ఎవరైనా భక్తులు మోసపోయారా అనే కోణంలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఆయన వివరించారు.

# టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు మోక్షం ఎప్పుడు?



**పార్వతీపురం, పతాకం న్యూస్:** టిడ్కో ఇళ్ల నిర్మాణాలకు మోక్షం లభించడం లేదు. ఏళ్లు గడుస్తున్నా.. పనులు పూర్తి కావడం లేదు. ఈ ఏడాది ఉగాది నాటికి ఇళ్లు అప్పగిస్తామని ప్రభుత్వం ప్రకటించినా.. అది సాధ్యపడలేదు. నేటికీ మౌలిక వసతుల పనులు పూర్తికాపోగా.. ఇంకా పిచ్చిమొక్కల నడుమ గృహ సముదాయాలు దర్శనమిస్తున్నాయి. దీంతో గృహ ప్రవేశాల కోసం ఎదురుచూస్తున్న లబ్ధిదారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు సొంతింటి కలను సాకారం చేయాలనే లక్ష్యంతో గత టీడీపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్మాత్మకంగా టిడ్కో గృహ నిర్మాణాలకు శ్రీకారం చుట్టింది. ఈ మేరకు జిల్లాలో పార్వతీపురం, సాలూరులో ఈ పనులు శరవేగంగా చేపట్టారు. అయితే గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సీన్ మారింది. సకాంలో బిల్లులు చెల్లించని కారణంగా ఎక్కడి నిర్మాణాలు అక్కడే నిలిచిపోయాయి. లబ్ధిదారుల సమస్యలను పరిగణనలోకి తీసుకున్న కూటమి ప్రభుత్వం టిడ్కో ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించింది. అయితే మౌలిక వసతుల పనులు ఇంకా కొలిక్కి రావడం లేదు. మరోవైపు గృహ ప్రవేశాలపై కూడా స్పష్టత కొరవడింది. త్వరితగతిన నిర్మాణాలు పూర్తి చేసి.. పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించి గృహ యోగం కల్పించాలని లబ్ధిదారులు కోరుతున్నారు. పార్వతీపురం మండలంలోని అడ్డాపుశీల గ్రామ సమీపంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సంబంధించి మున్సిపల్, రెవెన్యూ అధికారులు అప్పట్లో 12 ఎకరాల ఎకరాలను సేకరించారు. ఈ ఇళ్ల కోసం పట్టణంలోని 1503 మంది దరఖాస్తు చేసుకున్నారు. ఏపీ మౌలిక సదుపాయాల కల్పన సంస్థకు గృహ నిర్మాణ బాధ్యతలు అప్పగించారు. రెండేళ్ల పాటు గ్రూప్ హౌస్‌ల నిర్మాణం చకచకా సాగింది. ఆ తర్వాత చిన్న చిన్న సాంకేతిక లోపాల వల్ల ఇళ్ల నిర్మాణానికి గ్రహణం పట్టింది. 2016లో రూ.500 చెల్లించిన 1503 దరఖాస్తుదారుల్లో 768 మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. 2017లో లాటరీ ద్వారా లబ్ధిదారులకు ఎంపిక చేసి గ్రూప్ హౌస్‌లను కేటాయించారు. మిగతా వారి దరఖాస్తులను రద్దు చేశారు. అయితే లాటరీ ద్వారా ఎంపికైన వారికి నేటికీ టిడ్కో ఇళ్లను మంజూరు చేయలేదు. కాగా గృహ నిర్మాణాలు జరిగినా.. ఇప్పటి వరకు రహదారులు, తాగునీరు, విద్యుత్ సరఫరా సౌకర్యాలు ఇంకా చేపట్టకపోవడం వల్ల లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. మధ్య తరగతి కుటుంబాల కోసం అప్పటి టీడీపీ ప్రభుత్వం 500 చదరపు అడుగుల్లో గ్రూప్ హౌస్‌లను నిర్ణయించింది. ఈ మేరకు అధికారులు అప్పట్లో 676 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వారంతా రూ.50 వేలు చొప్పున ప్రభుత్వానికి డీడీల రూపంలో చెల్లించారు. అయితే 2019లో వైసీపీ ప్రభుత్వం వారికి షాక్ ఇచ్చింది. లబ్ధిదారుల జాబితాలో కోత విధించింది. మరోవైపు సాంకేతిక కారణాలు చూపుతూ గ్రూప్ హౌస్‌ల నిర్మాణం చేపట్టలేమని తేల్చేసింది. దీంతో తాము చెల్లించిన డబ్బులు తిరిగివ్వాలని లబ్ధిదారులు అప్పట్లో మున్సిపల్, కలెక్టర్ కార్యాలయాల చుట్టు తిరిగినా ఫలితం లేకపోయింది. కూటమి ప్రభుత్వం పాలనా పగ్గాలు చేపట్టిన తర్వాత శుభవార్త అందించింది. రూ.50 వేలు చెల్లించిన లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేయనున్నట్లు ప్రకటించింది. దీనిపై టిడ్కో కో ఆర్డినేటర్ కాంతారావును వివరణ కోరగా.. ' రూ.50 వేలు చెల్లించిన 676 మంది లబ్ధిదారులకు రూ.2.25 కోట్లను త్వరలో చెక్కుల రూపంలో అందిస్తాం. ఇప్పటికే పట్టణంలో 15 సచివాలయాలకు వారి వివరాలను అందజేశాం. టిడ్కో గృహాల సముదాయంలో వసతి కల్పన, ప్రారంభోత్సవాల విషయం ఉన్నతాధికారుల దృష్టిలో ఉంది. ' అని తెలిపారు. సాలూరు పట్టణానికి కూతవేటు దూరంలోని చంద్రంపేట సమీపంలో టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. అప్పట్లో 1444 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. చదరపు అడుగుల విస్తీర్ణం బట్టీ లబ్ధిదారులు రూ.500, రూ.12,500, రూ,37,500 చొప్పున డీడీల రూపంలో మున్సిపల్ కార్యాలయానికి చెల్లించారు. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని పట్టించుకోలేదు. లబ్ధిదారుల సంఖ్యను కుదించింది. 1248 మందిని అర్హులుగా గుర్తించినా.. ఇళ్ల నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పనులేవీ పూర్తికాకపోయినా.. ఎన్నికలకు ముందు 2024, ఫిబ్రవరి 20న వైసీపీ సర్కారు హడావుడిగా టిడ్కో గృహ ప్రవేశాలు చేపట్టింది. 22 బ్లాకులకు గాను కేవలం 18 బ్లాకుల్లో 1056 ఇళ్ల నిర్మాణం పూర్తి కావడంతో గృహ ప్రవేశాలను ఎంతో అట్టహాసంగా నిర్వహించారు. అయితే మౌలిక వసతులు కల్పించకపోవడంతో ఏ ఒక్క లబ్ధిదారు ఆ ఇళ్లలో దిగలేదు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టిడ్కో ఇళ్ల సముదాయంలో మురుగునీటి శుద్ధి ప్లాంట్‌ను పనులు శరవేగంగా పూర్తి చేసింది. విద్యుత్ సమస్యలను పరిష్క రించింది. దీంతో 900 మంది తమ ఇళ్లకు విద్యుత్ మీటర్లు అమర్చుకున్నారు. మరోవైపు గుమడాం గ్రామానికి ఆనుకుని ఉన్న వేగావతి నది నుంచి టిడ్కో గృహ సముదాయానికి నీరు చేరేలా చర్యలు తీసుకున్నారు. ఇప్పటికే 18 బ్లాకుల్లో ఇళ్ల నిర్మాణం పూర్తయింది. మిగతా నాలుగు బ్లాకులకు గాను మూడు బ్లాకుల్లో శ్లాబు పనులు పూర్తయ్యాయి. మరో బ్లాక్ నిర్మాణం కూడా త్వరలో పూర్తి చేస్తామని ఏఈ రాజీవ్ తెలిపారు. విద్యుత్, తాగునీరు, కాలువలు పనులు కూడా పూర్తికావొచ్చాయని.. త్వరలోనే ఇళ్ల ప్రారంభోత్సవాలు జరుగుతాయని వెల్లడించారు. సాలూరు టిడ్కో గృహ సముదాయానికి సంబంధించి 812 మంది డీడీ రూపంలో వేలాది రూపాయలు చెల్లించారు. అయితే కేవలం 132 మందికి మాత్రమే రూ.30.60 లక్షలు చెల్లించారు. ఇంకా 680 మందికి రూ. 26.67 లక్షలు చెల్లించాల్సి ఉంది. మిగతా లబ్ధిదారులు కూటమి ప్రభుత్వంపైనే ఆశలు పెట్టుకున్నారు.

# ఇండియా పోస్ట్ ఆల్ టైమ్ రికార్డ్.. తొలి త్రైమాసికంలో రూ.4,009 కోట్ల ఆదాయం!




**న్యూఢిల్లీ, పతాకం న్యూస్:** భారత తపాలా శాఖ (ఇండియా పోస్ట్) చారిత్రాత్మక మైలురాయిని అందుకుంది. 2026-27 ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికంలో రూ.4,009 కోట్ల ఆదాయం సాధించి సరికొత్త రికార్డు సృష్టించింది. గత ఏడాదితో పోలిస్తే ఇది 22 శాతం అధికం. ఒక త్రైమాసికంలో ఇండియా పోస్ట్ ఆదాయం రూ.4,000 కోట్ల మార్కును దాటడం ఇదే తొలిసారి. ఈ చారిత్రక విజయంపై చర్చించేందుకు జులై 14న ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో త్రైమాసిక వ్యాపార సమీక్ష సమావేశం జరిగింది. కేంద్ర కమ్యూనికేషన్ల శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో సహాయ మంత్రి డాక్టర్ చంద్రశేఖర్ పెమ్మసాని, పోస్టల్ శాఖ కార్యదర్శి సుబ్రత్ దాస్, డైరెక్టర్ జనరల్ జితేంద్ర గుప్తా, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ అద్భుతమైన ప్రదర్శనకు కారణమైన ఇండియా పోస్ట్ ఉద్యోగులందరినీ మంత్రులు అభినందించారు. ఇండియా పోస్ట్ ఆధ్వర్యంలోని ఆరు కీలక వ్యాపార విభాగాల్లోనూ గణనీయమైన వృద్ధి నమోదైంది. ముఖ్యంగా ఆధార్, కేవైసీ, పాస్‌పోర్ట్ వంటి పౌర కేంద్రీకృత సేవల విభాగంలో అత్యధికంగా 86 శాతం వృద్ధి నమోదైంది. ఇ-కామర్స్ కారణంగా పార్శిల్ విభాగంలో 50 శాతం, మెయిల్స్ విభాగంలో 42 శాతం, అంతర్జాతీయ వాణిజ్యంలో 34 శాతం వృద్ధి కనిపించింది. పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ 20 శాతం, పోస్ట్ ఆఫీస్ సేవింగ్స్ బ్యాంక్ (రూరాదీ) 10 శాతం వృద్ధిని నమోదు చేశాయి. పలు సర్కిళ్లు అద్భుతమైన పనితీరును కనబరిచాయి. మొత్తం పనితీరులో ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, పశ్చిమ బెంగాల్ మొదటి మూడు స్థానాల్లో నిలిచాయి.

పౌర సేవల లక్ష్యాలను అధిగమించడంలో పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్ ముందుండగా.. పార్శిల్ విభాగంలో బీహార్, తమిళనాడు సత్తా చాటాయి. సేవింగ్స్ బ్యాంక్ కార్యకలాపాల్లో ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, జార్ఖండ్ ఉత్తమ పనితీరు కనబరిచాయి. ఆదాయ వృద్ధితో పాటు, ఇండియా పోస్ట్ తన కార్యాచరణ సామర్థ్యాన్ని కూడా గణనీయంగా మెరుగుపరుచుకుంది. సున్నా లావాదేవీలు నమోదయ్యే బ్రాంచ్ పోస్టాఫీసుల సంఖ్య భారీగా తగ్గింది. ఆదాయంతో ఖర్చులను భరించే నిష్పత్తి (జుజ=) కూడా గత ఏడాదితో పోలిస్తే 41 శాతం నుంచి 47 శాతానికి మెరుగుపడింది.

ఈ సందర్భంగా మంత్రి సింధియా మాట్లాడుతూ, డేటా ఆధారిత పనితీరుతో ఈ వృద్ధిని కొనసాగించాలని సూచించారు. నిరంతర సమీక్షలు, పర్యవేక్షణ, ఉద్యోగుల నిబద్ధత వల్లే ఈ అద్భుత ఫలితాలు సాధ్యమయ్యాయని సహాయ మంత్రి పెమ్మసాని ప్రశంసించారు. లక్షలాది మంది తపాలా ఉద్యోగుల అవిశ్రాంత కృషికి, ప్రజల్లో పెరుగుతున్న నమ్మకానికి ఈ విజయం నిదర్శనంగా నిలుస్తోంది.

# ఐఏఎస్ ఆఫీసర్‌ను అంటూ పెళ్లి చేసుకున్న కిలాడీ... పెళ్లయ్యాక డబ్బులపై కన్ను!




**లక్నో, పతాకం న్యూస్:** సోషల్ మీడియాలో ఐఏఎస్ అధికారినని నమ్మించి, వివాహం చేసుకున్న అనంతరం భారీగా డబ్బు కోసం వేధింపులకు పాల్పడిన ఓ యువతిని ఉత్తరప్రదేశ్ పోలీసులు అరెస్ట్ చేశారు. పెళ్లయిన కేవలం నెల రోజుల్లోనే రూ.40 లక్షలు చెల్లించాలంటూ భర్త కుటుంబాన్ని బెదిరించడంతో ఈ ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళితే.. బదౌన్ జిల్లాకు చెందిన సాధన అనే యువతి, తాను ఐఏఎస్ అధికారినని పేర్కొంటూ ఫేస్‌బుక్‌లో నకిలీ ప్రొఫైల్‌ను సృష్టించింది. ఈ క్రమంలో బరేలీ జిల్లాకు చెందిన అభిషేక్ అనే యువకుడితో పరిచయం పెంచుకుని, అతడిని మరియు అతని కుటుంబాన్ని నమ్మించి పెళ్లికి ఒప్పించింది. సుమారు నెల రోజుల క్రితమే వీరి వివాహం జరిగింది. అయితే, పెళ్లయిన కొద్ది రోజులకే సాధన తన అసలు స్వరూపాన్ని ప్రదర్శించింది. తనకు రూ.40 లక్షల నగదు ఇవ్వాలని భర్తపై తీవ్ర ఒత్తిడి తీసుకువచ్చింది. ఒకవేళ డబ్బు ఇవ్వని పక్షంలో కుటుంబ సభ్యులందరిపై తప్పుడు కేసులు పెడతానని బెదిరింపులకు దిగింది. అంతే కాకుండా, ఆ కుటుంబానికి చెందిన సుమారు రూ.20 లక్షల విలువైన భూమిని విక్రయించాలని కూడా డిమాండ్ చేసింది. సాధన ప్రవర్తనపై అనుమానం కలిగిన అభిషేక్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసుల ప్రాథమిక విచారణలో ఆమె ఐఏఎస్ అధికారిణి కాదని, అసలు ఆమెకు ఎటువంటి ప్రభుత్వ ఉద్యోగమే లేదని స్పష్టమైంది. దీంతో బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, నిందితురాలిని అరెస్ట్ చేశారు.

## అగ్రికల్చర్ ఏఓ శ్రీహరి హత్య కేసులో ట్విస్ట్.. నిందితుడు హరికృష్ణ కుటుంబం ఆత్మహత్య



**ప్రకాశం జిల్లా, పతాకం న్యూస్:** వ్యవసాయ అధికారి (ఏవో) శ్రీహరి హత్య కేసులో సంచలన పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న హరికృష్ణ, తన కుటుంబంతో కలిసి సింగరాయకొండ వద్ద రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన కలకలం రేపింది. ఈ ఘటనలో హరికృష్ణ, అతని భార్యతో పాటు ఇద్దరు చిన్నారులు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న రైల్వే, స్థానిక పోలీసులు ఘటనాస్థలికి చేరుకున్నారు. నలుగురి మృతదేహాలను స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో దర్యాప్తు సాగిస్తున్నారు. పోలీసుల ప్రాథమిక విచారణలో.. ఆస్తి కోసం హరికృష్ణ తన సొంత బావ అయిన వ్యవసాయ అధికారి శ్రీహరిని హత్య చేసినట్లు వెల్లడైంది. ఈ కేసులో పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేయడంతో తీవ్ర మనస్తాపానికి గురైన హరికృష్ణ కుటుంబంతో కలిసి ఈ నిర్ణయం తీసుకున్నట్లు అనుమానిస్తున్నారు. కాగా.. ఈ కేసు దర్యాప్తులో నిర్లక్ష్యంగా వ్యవహరించిన బుచ్చిరెడ్డిపాలెం సీఐ, ఎస్ఐలను నెల్లూరు జిల్లా ఎస్పీ అజిత వేజెండ్ల సస్పెండ్ చేశారు. అలాగే బుచ్చిరెడ్డిపాలెం పోలీస్ స్టేషన్‌కు చెందిన 23 మంది సిబ్బందిపై బదిలీ వేటు వేశారు.

## అధిక మోతాదులో మాత్రలు మింగి.. చికిత్స పొందుతూ మహిళ మృతి

**గజపతినగరం, పతాకం న్యూస్:** అధిక మోతాదులో మాత్రలు మింగి చికిత్స పొందుతూ మహిళ మృతిచెందిన ఘటన చోటు చేసుకుంది. ఎస్ఐ కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. డొలపేట గ్రామా నికి చెందిన వాసా తిరుమల(28) అనే మహిళ గత కొంతకాలంగా థైరాయిడ్, షుగర్ వ్యాధులతో బాధ పడుతున్నారు. వివాహం తర్వాత ఈ సమస్య అధికం అయ్యింది. ఈక్రమంలో ఈనెల 9వ తేదీన థైరాయిడ్‌కు చెందిన మాత్రలను అధిక మోతాదులో మింగారు. దీంతో పరిస్థితి విషమించింది. వెంటనే కుటంబీకులు జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించా రు. అక్కడ ఆమె చికిత్స పొందుతూ మృతిచెందారు. మృతురాలికి ఎం.వెంకటాపురం గ్రామానికి చెందిన తలే బాలకృష్ణతో కొన్నేళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతిరాలి తల్లి వాసా రమణమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి



**శ్రీకాకుళం, పతాకం న్యూస్:** సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయులు గళమెత్తారు. శ్రీకాకుళంలో కలెక్టరేట్ వద్ద ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక(ఫ్యాప్టో) ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఫ్యాప్టో సంఘ చైర్మన్ బమ్మిడి శ్రీరామమూర్తి మాట్లాడుతూ '12వ వేతన సవరణ సంఘాన్ని తక్షణమే ఏర్పాటు చేయాలి. 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలి. ఇన్‌సర్వీసు ఉపాధ్యాయులకు నిర్వహించే ప్రత్యేక టెట్‌లో ఉత్తీర్ణత మార్కులు ఒకే విధంగా ఉండాలి. పంచాయతీరాజ్ యాజమాన్యంలో పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణమే చేపట్టాలి. సీపీఎస్ విధానం రద్దు చేయాల'ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఫ్యాప్టో సంఘ నాయకులు ప్రతాప్‌కుమార్, టి.ప్రభాకరరావు, పి.వెంకటేశ్వర్లు, ఎల్.బాబురావు, బి.జగన్మోహన్‌రావు, డి.హరిప్రసన్న, పి.తిరుమలరావు, సీహెచ్ దిలీప్, డి.సరస్వతి, రవీంద్ర, భానుమూర్తి పాల్గొన్నారు.

## రైలు పట్టాలపై తెగిపడిన హైటెన్షన్ వైర్లు

**పొందూరు, పతాకం న్యూస్:** పొందూరు రైల్వేస్టేషన్‌లో విద్యుత్ హైటెన్షన్ వైర్లు మరోసారి రైల్వే ట్రాక్‌పై తెగిపడ్డాయి. దీంతో ప్రయాణికులు ఒక్కసారి ఆందోళనకు గురయ్యారు. ఈనెల ఒకటిన హై టెన్షన్ వైర్లు తెగిప డినప్పటికీ ఆ సమయంలో ఆ ట్రాక్‌పై ఏ రైళ్లు రాకపోకలు సాగించకపోవడం, ట్రాక్ పక్క ప్రయాణికులు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. 15 రోజుల వ్యవధిలో రెండోసారి ఇలాంటి పరి స్థితి




ఏర్ప డడంతో ప్రయాణికులు ఆవేదన వ్యక్తంచేశారు. అయితే సాంకేతిక సిబ్బంది నిర్లక్ష్యం కారణంగానే మంగళవారం మరోసారి హైటెన్షన్ వైర్లు తెగిపడ్డాయని పలువురు ప్రయాణికులు పేర్కొంటున్నారు.

## పాడి పరిశ్రమ అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



**సారవకోట, పతాకం న్యూస్:** పాడి పరిశ్రమ అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. బురదకొత్తూరులో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయంతో పాటు అనుబంధ సంస్థలను లాభసాటిగా మార్చేందుకు... గ్రామీణ స్వయం ఉపాధిని ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం సంక్షేమ పథకాలతో పాటు రాయితీలను అమలు చేస్తోందన్నారు. అనంతరం పశు దాణా ప్యాకెట్లను రైతులకు పంపిణీ చేశారు. బురదకొత్తూరులో పాఠశాల అదనపు తరగతి గది, ప్రహరీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, మార్కెట్ కమిటీ చైర్మన్ తర్ర బలరాం, ఉపాధ్యక్షులు డి.వెంకటరమణ, సారవకోట సొసైటీ అధ్యక్షుడు సురవరపు తిరుపతిరావు, పశుసంవర్ధకశాఖ ఏడీ మంద లోకనాథం, టీడీపీ నాయకులు రత్నాలు నాయుడు, సాధు కృష్ణారావు, మూకళ్ల చిన్నయ్య, పట్ట ఉమామహేశ్వరరావు, మురళీధర్, తదితరులు పాల్గొన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా వ్యవసాయ మార్కెట్ కమిటీలు పనిచేయాలని ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశంలో ఆయన పాల్గొన్నారు మార్కెట్ కమిటీ కార్యాలయానికి ప్రహరీ నిర్మాణానికి, గొదాం నిర్మాణానికి, కార్యాలయంపై మార్కెట్ కమిటీ అధ్యక్షులకు ప్రత్యేక గది నిర్మాణానికి రూ.1.50 కోట్ల మంజూరుకు ఏకగ్రీవంగా తీర్మానించారు.

## విద్యుదాఘాతంతో బాలుడి మృతి

**విజయనగరం, పతాకం న్యూస్:** విద్యుదాఘాతంతో బాలుడు మృతి చెందిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బొండపల్లి మండలం కనిమెరక గ్రామానికి చెందిన లోచర్ల గణేష్(17) గత రెండు నెలల కిందట వరుసకు అక్క అయిన అశ్విని ఇంటికి గజపతినగరం వచ్చాడు. తన అక్క భర్తకు చెందిన వాటర్ సర్వీసింగ్ సెంటర్ వద్దకు వెళ్లాడు. అక్కడ పంపుసెట్టును పట్టుకోగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురయ్యాడు. తీవ్ర గాయలపాలైన గణేష్‌ను స్థానిక ఏరియా ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. అయితే అప్పటికే గణేష్ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు.

# కిడ్నీల్లో రాళ్లు ఏర్పడేందుకు కారణాలు ఏమిటి? ఎలా గుర్తించాలి?



కిడ్నీలో రాళ్లు ఏర్పడే సమస్య పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. శరీరంలో నీటి కొరత, అధిక ఉప్పు తీసుకోవడం, కొన్ని జీవనశైలి అలవాట్లు ఈ సమస్యకు ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. కిడ్నీలో రాళ్లు మొదట్లో ఎలాంటి లక్షణాలు చూపక పోయినా, అవి కదలడం లేదా మూత్ర ప్రవాహానికి అడ్డంకిగా మారినప్పుడు తీవ్రమైన నొప్పి కలిగిస్తాయి. అందుకే ప్రారంభ సంకేతాలను గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకోవడం అవసరమని నిపుణులు సూచిస్తున్నారు. కిడ్నీలలో ఖనిజ వ్యర్థాలు పేరుకుపోయి గట్టిపడటం వల్ల రాళ్లు ఏర్పడతాయి. ముఖ్యంగా వేసవిలో ఎక్కువగా చెమట పట్టినా తగినంత నీరు తాగకపోయినా మూత్రం పరిమాణం తగ్గుతుంది. దీంతో రాళ్లను ఏర్పరిచే ఖనిజాల సాంద్రత పెరిగి కిడ్నీలో రాళ్లు ఏర్పడే ప్రమాదం అధికమవుతుంది. వేడి వాతావరణం, ఎక్కువసేపు ప్రయాణాలు, ఉప్పు ఎక్కువగా ఉండే చిరుతిండ్లు, టీ లేదా కాఫీ ఎక్కువగా తాగడం, నీరు తక్కువగా తీసుకోవడం, మూత్రాన్ని ఎక్కువసేపు ఆపుకోవడం వంటి అలవాట్లు కూడా ఈ ప్రమాదాన్ని పెంచుతాయి. తక్కువ నీరు తాగడం, అధిక ఉప్పు తీసుకోవడం, మాంసాహారాన్ని ఎక్కువగా తీసుకోవడం, తరచూ మూత్రనాళ ఇన్‌ఫెక్షన్లు రావడం, కుటుంబంలో కిడ్నీ రాళ్ల చరిత్ర ఉండటం, ఊబకాయం, మెటబాలిక్ సిండ్రోమ్, గతంలో కిడ్నీ రాళ్లు రావడం, వైద్యుల సలహా లేకుండా కాల్షియం లేదా విటమిన్ సి సప్లిమెంట్లు తీసుకోవడం, గౌట్ లేదా హైపర్‌పారాథైరాయిడిజం వంటి సమస్యలను కూడా కిడ్నీ రాళ్లకు ప్రమాద కారకాలుగా పరిగణిస్తారు. కిడ్నీలో రాళ్లు ఉన్నప్పుడు నడుము పక్క భాగంలో లేదా వీపులో తీవ్రమైన నొప్పి వస్తుంది. ఆ నొప్పి క్రమంగా తొడల వరకు వ్యాపించే అవకాశం ఉంటుంది. మూత్ర విసర్జన సమయంలో మంట, మూత్రంలో రక్తం కనిపించడం, వికారం, వాంతులు, తరచూ మూత్రానికి వెళ్లాలనిపించడం, జ్వరం లేదా చలి వణుకులు వంటి లక్షణాలు కూడా కనిపిస్తాయి. ఇవి రాళ్లు కదులుతున్నాయని లేదా మూత్ర ప్రవాహానికి అడ్డంకిగా మారుతున్నాయని సంకేతాలను సూచిస్తాయి.

కొన్ని సందర్భాల్లో లక్షణాలు అంత స్పష్టంగా కనిపించవు. నొప్పితోపాటు జ్వరం రావడం, మూత్రం పరిమాణం తగ్గిపోవడం, తీవ్రమైన వాంతులు, మందులు వేసుకున్నా తగ్గని నొప్పి వంటి పరిస్థితులు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. ముఖ్యంగా ఒక్క కిడ్నీ మాత్రమే ఉన్నవారు, గర్భిణులు, మధుమేహంతో బాధపడేవారు, వృద్ధులు లేదా గతంలో పలుమార్లు కిడ్నీ రాళ్ల సమస్య ఎదుర్కొన్నవారు మరింత అప్రమత్తంగా ఉండాలి. కిడ్నీ రాళ్ల ప్రమాదాన్ని తగ్గించాలంటే రోజంతా తగినంత నీరు తాగడం అత్యంత ముఖ్యమైన అలవాటు. ఒకేసారి ఎక్కువ నీరు తాగడం కంటే రోజంతా సమానంగా తీసుకోవడం మంచిది. ఉదయం లేవగానే సుమారు అర లీటర్ నీరు తాగడం, ఇంటి నుంచి బయటకు వెళ్లే ముందు మరో అర లీటర్, పని సమయంలో ఒకటి నుంచి ఒకటిన్నర లీటర్లు, సాయంత్రం మరో అర లీటర్ నుంచి 700 మిల్లీలీటర్లు, అవసరమైతే నిద్రకు ముందు కొద్దిగా నీరు తాగడం ఉపయోగకరంగా ఉంటుంది. ఆహారంలో ఉప్పు పరిమాణాన్ని తగ్గించడం కూడా కీలకం. ప్యాకెట్ స్నాక్స్, చిప్స్, పాపడ్లు, ఊరగాయలు, ఉప్పు ఎక్కువగా ఉండే మిశ్రమాలు, ఫాస్ట్‌ఫుడ్, హోటల్ ఆహారాన్ని పరిమితంగా తీసుకోవడం మంచిది. అధిక ఉప్పును తీసుకోవడం వల్ల మూత్రంలో కాల్షియం పెరిగి రాళ్లు ఏర్పడే అవకాశం అధికమవుతుంది. కాల్షియం రాళ్లు ఉన్నాయని భావించి పాలు, పెరుగు వంటి కాల్షియం ఉన్న ఆహారాలను పూర్తిగా మానేయకూడదని నిపుణులు సూచిస్తు న్నారు. ఆహారంలో కాల్షియం చాలా తక్కు వగా ఉంటే శరీరం ఆక్సలేట్‌ను ఎక్కువగా శోషించడంతో కాల్షియం ఆక్సలేట్ రాళ్లు ఏర్పడే ప్రమాదం మరింత పెరుగుతుంది. నిమ్మరసాన్ని ఆహారంలో చేర్చడం కొంత మందికి ప్రయోజనకరంగా ఉంటుంది. నిమ్మలో ఉండే సిట్రేట్ రాళ్లు ఏర్పడే అవ కాశాన్ని తగ్గించడంలో సహాయపడుతుంది. అయితే ఇది ఇప్పటికే ఏర్పడిన రాళ్లను కరిగించే చికిత్స కాదని గుర్తుంచుకోవాలి. నిమ్మరసంలో అధికంగా చక్కెర కలపకుండా తీసుకోవడం మంచిది. ఎర్ర మాంసం (మటన్), చికెన్ వంటి మాంసాహారాన్ని అధికంగా తీసుకోవడం వల్ల కొందరిలో యూరిక్ యాసిడ్ పెరిగి రాళ్లు ఏర్పడే అవకాశం ఉంటుంది. అందువల్ల మితంగా తీసుకోవడం ఉత్తమం. అలాగే ఇంటి చిట్కాలతోనే చికిత్స చేసుకోవడానికి ప్రయత్నించకుండా, మూత్ర ప్రవాహానికి అడ్డంకి ఏర్పడిన అనుమానం ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలి. నొప్పి తగ్గిపోయిందని రాళ్లు పూర్తిగా బయటకు వచ్చాయని భావించకూడదు. అవసరమైనప్పుడు స్కానింగ్ వంటి పరీక్షలు చేయించుకుని రాయి బయటకు వెళ్లిందా లేదా, కిడ్నీలో వాపు తగ్గిందా అనే విషయాన్ని నిర్ధారించుకోవాలి. జ్వరం, తీవ్రమైన నొప్పి, మూత్రంలో రక్తం, మూత్రం తగ్గిపోవడం లేదా లక్షణాలు మళ్లీ మళ్లీ రావడం వంటి పరిస్థితుల్లో ఆలస్యం చేయకుండా యూరాలజిస్టును సంప్రదించడం అవసరమని నిపుణులు తెలియజేస్తున్నారు.

# మందకొడిగా 516-ఈ హైవే పనులు!

## ఎప్పటికీ పూర్తవుతుందో తెలియని పరిస్థితి.. వాహనదారులకు తప్పని కష్టాలు



**పాడేరు, పతాకం న్యూస్:** జిల్లాలో జాతీయ రహదారి 516-ఈ పనులు ఆశించిన స్థాయిలో వేగంగా జరగకపోవడంతో జిల్లా వాసులు అవస్థలు పడుతున్నారు. ముఖ్యంగా చింతపల్లి మండలం లంబసింగి నుంచి పాడేరు వరకు 50 కిలోమీటర్ల రోడ్డు పనులు మందకొడిగా జరుగుతుండడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు కురిస్తే ఆ మార్గంలో వాహనదారుల అవస్థలు వర్ణణాతీతం. రాజమహేంద్రవరం నుంచి అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా విజయనగరం జిల్లాకు అనుసంధానిస్తూ జాతీయ రహదారి(516-ఈ) నిర్మాణ పనులు గత నాలుగేళ్లుగా జరుగుతున్నాయి. రాజమహేంద్రవరం నుంచి రంపచోడవరం, కొయ్యూరు మండలం కాకరపాడు నుంచి చింతపల్లి మండలం లంబసింగి, జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట, డుంబ్రిగుడ, అరకులోయ, అనంతగిరి మీదుగా విజయనగరం జిల్లా బొడ్డవర వరకు జాతీయ రహదారి నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. రాజమహేంద్రవరం నుంచి విజయనగరం జిల్లా బొడ్డవర వరకు సుమారుగా 371 కిలోమీటర్ల జాతీయ రహదారిని రూ.1,575 కోట్లతో చేపట్టేందుకు కేంద్రం నిధులు మంజూరు చేసింది.

జిల్లాలో ప్రస్తుతం జాతీయ రహదారి పనులు వివిధ దశల్లో ఉన్నాయి. ఇప్పటికే ఏజెన్సీలో కొయ్యూరు, జీకే వీ?ధి, చింతపల్లి మండలాల్లోని రోడ్డు పనులు దాదాపుగా 90 శాతం పూర్తయ్యాయి. అక్కడక్కడ చిన్నపాటి ప్యాచ్ వర్క్‌లు మినహా కాకరపాడు నుంచి చింతపల్లి(లంబసింగి) వరకు హైవే పూర్తయింది. అలాగే లంబసింగి నుంచి తాజంగి మీదుగా జి.మాడుగుల, అక్కడ నుంచి పాడేరు వరకు పనులు ప్రస్తుతం జరుగుతున్నాయి. దీనిలో కూడా అక్కడక్కడ రోడ్డు నిర్మాణం జరగ్గా, కొన్నిచోట్ల మట్టి పనులు, వంతెనల నిర్మాణం వంటివి కొనసాగుతున్నాయి. అయితే ఆయా రోడ్డు పనులు వేగంగా జరగకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. హైవే పనులు జరుగుతుండడంతో గతంలో ఉన్న పాత రోడ్డును వెడల్పు చేయకుండా, ఇతర ఎటువంటి నిర్వహణ చేపట్టకుండా వదిలేశారు. దీంతో అరకొర పనులతో ఉన్న హైవేపైనే ప్రయాణాలు సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. అయితే మట్టి, రాళ్ల పిక్కలతో రోడ్డు ఉండడంతోపాటు చాలా చోట్ల కల్వర్టులు, వంతెనల పనులు జరుగుతుండడంతో రాకపోకలకు అంతగా అనువుగా లేని పరిస్థితి ఏర్పడింది. దీంతో అవస్థలు పడుతూ పాడేరు నుంచి లంబసింగి మార్గంలో జనం రాకపోకలు సాగిస్తున్నారు. ఇప్పటికైనా జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలని పలువురు కోరుతున్నారు. జిల్లాలో జరుగుతున్న జాతీయ రహదారి పనులు వేగవంతం చేయాలని హైవే అథారిటీ అధికారులు, కాంట్రాక్టర్లను కలెక్టర్ టి.నిషాంతి పలుమార్లు ఆదేశించినప్పటికీ పనుల్లో వేగం కనిపించడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. జాతీయ రహదారి నిర్మాణ పనులు సకాలంలో జరగకపోవడంతో ప్రమాదాలు జరగడం, వర్షాలు కురిస్తే రోడ్డంతా బురదమయంగా మారి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగడం, పనులు మందకొడిగా జరుగుతుండడంతో ప్రయాణాలు ఆలస్యం కావడం వంటి సమస్యలు ఏర్పడుతున్నాయి. వాటిని దృష్టిలో పెట్టుకునే కలెక్టర్ నిషాంతి పలుమార్లు హైవే అథారిటీ అధికారులు, కాంట్రాక్టర్లతో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి మరీ రోడ్డు పనులు వేగవంతం చేయాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. అయినప్పటికీ పనుల్లో వేగం కనిపించడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

# హర్మూజ్ జలసంధిపై ట్రంప్ యూటర్న్..

## 20 శాతం టోల్ ప్రతిపాదన వెనక్కి!



**ఇరాన్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఒక కీలక నిర్ణయాన్ని వెల్లడించారు. హర్మూజ్ జలసంధి మీదుగా రవాణా అయ్యే సరుకులపై 20 శాతం సుంకం (టోల్) విధించాలన్న తన ప్రతిపాదనను ఆయన విరమించుకున్నారు. ఈ సుంకానికి బదులుగా గల్ఫ్ దేశాలతో భారీస్థాయిలో వాణిజ్య, పెట్టుబడి ఒప్పందాలు కుదుర్చుకోనున్నట్లు ఆయన ప్రకటించారు. ప్రతిపాదించిన కేవలం 24 గంటల వ్యవధిలోనే ట్రంప్ తన నిర్ణయాన్ని మార్చుకోవడం గమనార్హం. సోషల్ మీడియా వేదికగా ట్రంప్ ఈ వివరాలను వెల్లడించారు. "మధ్యప్రాచ్య దేశాల నేతలతో జరిపిన ఫలవంతమైన చర్చల అనంతరం ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఒప్పందాలను భారీ డీల్స్‌గా అభివర్ణించిన ఆయన, ఇవి ఇరుపక్షాలకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటాయని తెలిపారు. ఈ ఒప్పందాల ద్వారా అమెరికాలో మరిన్ని కర్మాగారాలు, తయారీ ప్లాంట్లు ఏర్పాటవుతాయని, తద్వారా అధిక వేతనాలతో కూడిన లక్షలాది ఉద్యోగాలు సృష్టించబడతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిజానికి ట్రంప్ ఈ సుంకం విధింపు ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. హర్మూజ్ జలసంధికి అమెరికా సంరక్షకుడిగా వ్యవహరిస్తుందని, ఈ కీలక మార్గంలో భద్రత కల్పించేందుకు అయ్యే వ్యయాన్ని తిరిగి రాబట్టేందుకే ఈ సుంకం విధిస్తున్నట్లు ప్రకటించారు. ఇరాన్‌తో తీవ్ర ఉద్రిక్తతల నెలకొన్న నేపథ్యంలో, ప్రపంచ చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన ఈ జలసంధి భద్రత కోసం ఇటువంటి చర్యలు అవసరమని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ సుంకం ప్రతిపాదనపై గల్ఫ్ దేశాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాయి. దీనివల్ల అంతర్జాతీయ వాణిజ్యం, ఇంధన విపణిపై ప్రతికూల ప్రభావం పడుతుందని ఆయా దేశాలు భావించాయి.

మరోవైపు, ఈ జలసంధిపై అమెరికా ఆధిపత్యాన్ని సహించేది లేదని ఇరాన్ హెచ్చరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో ట్రంప్ తన నిర్ణయాన్ని సమీక్షించుకుని, సుంకం విధింపు కంటే ఆర్థిక దౌత్యానికే మొగ్గు చూపారు.




# వన్డే వరల్డ్ కప్ 2027 కోసం గిల్ మాస్టర్ ప్లాన్..




వన్డే ప్రపంచ కప్ 2027ను దృష్టిలో పెట్టుకుని ఇప్పటికే జట్టు కూర్పుపై ప్రయోగాలు ప్రారంభించినట్లు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ వెల్లడించాడు. బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల్లో అత్యుత్తమ సమతుల్యత కలిగిన జట్టును రూపొందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశాడు. ఇంగ్లండ్‌తో తొలి వన్డేలో 6 వికెట్ల తేడాతో భారత్ ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మ్యాచ్ అనంతరం గిల్ పలు విషయాలపై మాట్లాడాడు. 'మా బౌలింగ్ విభాగంలో మొత్తం యువ ప్లేయర్లే ఉన్నారు. బ్యాటింగ్ మాత్రం సీనియర్లతో నిండి ఉంది. అందుకే ఇంగ్లండ్‌పై ముందుగా బౌలింగ్ చేయాలని నిర్ణయించాం. 320 పరుగుల లక్ష్యం వచ్చినా దాన్ని ఛేదించే సామర్థ్యం మా బ్యాటింగ్‌కు ఉందనే విశ్వాసం ఉంది. మిడిలార్డర్ బ్యాటర్లు బాధ్యత తీసుకుని మ్యాచ్‌ను ముగించడం కెప్టెన్‌గా నాకు ఎంతో ధైర్యానిచ్చింది. 2027 వన్డే ప్రపంచ కప్‌ను దృష్టిలో పెట్టుకుని వివిధ జట్టు కూర్పులను పరీక్షిస్తున్నాం. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటిలోనూ సరైన లోతు ఉండే కాంబినేషన్ ఏదో తెలుసుకోవడానికి విభిన్న ప్రయోగాలు చేస్తున్నాం. భవిష్యత్తుకు ఉపయోగపడే జట్టును సిద్ధం చేయడమే మా లక్ష్యం. ఇంగ్లండ్‌లోని పిచ్‌లు, వాతావరణ పరిస్థితులు ప్రపంచ కప్‌కు ఆతిథ్యం ఇవ్వనున్న దక్షిణాఫ్రికాను గుర్తు చేస్తున్నాయి. కొత్త బంతితో బ్యాటింగ్ అంత సులభం కాదు. అయితే తర్వాత పిచ్ బ్యాటింగ్‌కు అనుకూలంగా మారింది. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త కాంబినేషన్లను పరీక్షించగలిగితే ప్రపంచ కప్‌కు అది ఎంతో ఉపయోగపడుతుంది' అని గిల్ వివరించాడు. తొలి వన్డేలో సీనియర్ బ్యాటర్లు రోహిత్ శర్మ (11), విరాట్ కోహ్లీ (5) ఆశించిన స్థాయిలో రాణించకపోయినా భారత్ విజయం సాధించింది. ఇదే సమయంలో 2027 ప్రపంచ కప్‌ను దృష్టిలో పెట్టుకుని ఆటగాళ్లకు రొటేషన్ విధానం అమలు చేసే అంశాన్ని బీసీసీఐ పరిశీలిస్తున్నట్లు జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి.

## ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి వన్డేలో

# టీమిండియా ఘన విజయం



ఆహా.. భారత క్రికెట్ జట్టు గెలుపు రుచి చూసింది. ఒకటా, రెండా ఎన్నడూ లేని రీతిలో వరుసగా ఆరు టీ20ల్లో ఓడిన టీమిండియా ఎట్టకేలకు వన్డే సిరీస్‌లో బోణీ కొట్టింది. ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (75 బంతుల్లో 11 ఫోర్లు, 1 సిక్స్‌తో 80 రిటైర్డ్ హర్ట్) తన సూపర్ ఫామ్‌ను కొనసాగించగా, అక్షర్ పటేల్ (4/62; 52 బంతుల్లో 5 ఫోర్లు, 1 సిక్స్‌తో 57 నాటౌట్) ఆల్‌రౌండ్‌షోతో ఆకట్టుకున్నాడు. దీంతో భారత్ 6 వికెట్ల తేడాతో నెగ్గి సిరీస్‌లో 1-0తో ఆధిక్యం అందుకుంది. అటు ఎడ్జ్‌బాస్టన్‌లో వరుసగా ఏడు వన్డే విజయాల తర్వాత ఇంగ్లండ్‌కిదే తొలి ఓటమి. ముందుగా ఇంగ్లండ్ 47.5 ఓవర్లలో 258 పరుగులకు ఆలౌటైంది. జో రూట్ (76 నాటౌట్), డాసన్ (68), డకెట్ (43) రాణించారు. ఛేద నలో భారత్ 45.2 ఓవర్లలో 4 వికెట్లకు 262 పరుగులు చేసి గెలిచింది. సుందర్ (52 నాటౌట్), శ్రేయాస్ (35) రాణించారు. ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా అక్షర్ నిలిచాడు. ఓ మాదిరి ఛేదనను భారత్ సునా యాసంగా ముగించింది. కెప్టెన్ గిల్ ఈ ఏడాది ఆడిన ఆరు వన్డేల్లో ఐదు హాఫ్ సెంచరీలు సాధించడం విశేషం. శ్రేయాస్‌తో కలిసి తను మూడో వికెట్‌కు 101 పరుగులు జోడించాడు. చివర్లో అక్షర్ ధనాధన్ ఆటకు సుందర్ సహకరించాడు. అయితే వెటరన్స్ రోహిత్ (11), విరాట్ (5) వరుస ఓవర్లలో పెవిలియన్‌కు చేరి నిరాశపర్చారు. గిల్ 80 పరుగుల వద్ద కాలి కండరాలు పట్టేయడంతో రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. కాసేపటికే శ్రేయాస్ రనౌట్ కాగా రాహుల్ (1)ను టంగ్ బౌల్డ్ చేశాడు. ఆ తర్వాత అక్షర్ ఎదురుదాడికి పరుగులు వేగంగా వచ్చాయి. మరో ఆల్‌రౌండర్ సుందర్ సైతం హాఫ్ సెంచరీ సాధించ డంతో, 28 బంతులుండగానే మ్యాచ్ ముగిసింది. ఐదో వికెట్‌కు ఈ జోడీ అజేయంగా 102 రన్స్ జోడించింది. టాస్ గెలిచి బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో వెటరన్ జో రూట్ అజేయ ఆటతీరుతో ఆదుకున్నాడు. అతడికి డాసన్ సహకరించడంతో జట్టు గౌరవప్రదమైన స్కోరందుకుం ది. 17 ఓవర్లలోనే ఇంగ్లండ్ 80/5 స్కోరుతో కష్టాల్లో పడిన దశలో 200 కూడా కష్టమనిపించింది. అయితే రూట్-డాసన్ జోడీ జట్టును ఆదుకుంది.

**భారత్:** రోహిత్ (సి) బ్రూక్ (బి) కర్రాన్ 11, గిల్ (రిటైర్డ్ హర్ట్) 80, కోహ్లీ (ఎల్బీ) ఆర్చర్ 5, శ్రేయాస్ (రనౌట్) 35, వాషింగ్టన్ (నాటౌట్) 52, రాహుల్ (బి) టంగ్ 1, అక్షర్ (నాటౌట) 57, ఎక్స్‌ట్రాలు: 21; మొత్తం: 45.2 ఓవర్లలో 262/4; వికెట్ల పతనం: 1-43, 2-48, 3-157, 4-160; బౌలింగ్: ఆర్చర్ 10-0-60-1, టంగ్ 10-0-50-1, కర్రాన్ 10-0-55-1, రషీద్ 5.2-0-34-0, బెథెల్ 1-0-10-0, డాసన్ 2-0-10-0, జాక్స్ 7-0-43-0.




# 23న 'జన నాయగన్' విడుదల?



తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి విజయ్ నటించిన చివరి సినిమా 'జన నాయగన్' విడుదల విషయంలో ఇంకా ఓ క్లారిటీ రాలేదు. రివైజింగ్ కమిటీ నుంచి ఈ సినిమాకు 'ఎ' సర్టిఫికెట్ లభించిందని, దానితో ఈ నెల 24న 'జన నాయగన్'ను తెలుగు, తమిళ భాషల్లో భారీగా విడుదల చేయబోతున్నారని వార్తలు వస్తున్నాయి. ఈ విషయాన్ని విదేశీ ఎగ్జిబిటర్స్ స్పష్టం చేస్తున్నారు. ఇదిలా ఉంటే తాజాగా 'జన నాయగన్' మూవీ 24న కాకుండా ఒక రోజు ముందే 23నే విడుదల అవుతుందని మరో ప్రచారం మొదలైంది. చిత్రం ఏమంటే... ఈ రెండు తేదీల గురించి నిర్మాత వెంకట్ కె నారాయణ పెదవి విప్పడం లేదు. ఇదే సమయంలో విజయ్ తనయుడు జాసన్ సంజయ్ తెరకెక్కించిన 'సిగ్మా' మూవీ ఈ నెల 31న విడుదల కావాల్సి ఉంది. ఈ తండ్రీ కొడుకుల మధ్య ప్రస్తుతానికి సత్ సంబంధాలు లేకపోయినా... వీరి సినిమాలు బ్యాక్ టు బ్యాక్ విడుదల కావడం పట్ల కోలీవుడ్ వర్గాలలో గాఢమైన చర్చ సాగుతోంది. అయితే... సంక్రాంతి విడుదల కావాల్సిన 'జన నాయగన్' ఇంతకాలానికి సెన్సార్ ఉక్కు పిడికిలి నుంచి బయటకు వచ్చి విడుదల కానుండటం పట్ల ప్రతి ఒక్కరూ హర్షం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఈ సెలబ్రేషన్ మూమెంట్ కు 'జన నాయగన్' మేకర్స్ ఎందుకు ప్రాధాన్యం ఇవ్వడం లేదనేది ఓ పెద్ద ప్రశ్నగా మిగిలిపోయింది. అయితే... ఎన్నికల ప్రచార సమయంలో విజయ్ నిర్వహించిన బహిరంగ సభ కారణంగా జరిగిన తొక్కిసలాటలో నలభై మందికి పైగా ప్రజలు చనిపోయారు. అలాంటి దుర్ఘటనలు ఏవీ 'జన నాయగన్' సినిమా విడుదల రోజు జరగకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఇప్పుడు సీఎంగా ఉన్న విజయ్ మీద ఉంది. 'జన నాయగన్' రిలీజ్ టైమ్‌లో ఎలాంటి చేదు సంఘటన జరిగినా విజయ్... ప్రతిపక్షాల నుంచి చాలా విమర్శలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. అందుకే... చాలా లో-ప్రొఫైల్‌లో 'జన నాయగన్'ను మేకర్స్ విడుదల చేయాలనుకుంటున్నారని కోలీవుడ్ వర్గాలు చెబుతున్నాయి. ఏదేమైనా తమిళ నాడు సీఎం విజయ్ పట్ల ప్రజలకే కాదు.. ప్రేక్షకులకూ ప్రత్యేకమైన అభిమానం ఉంది. అది 'జన నాయగన్' కలెక్షన్స్ మీద ఖచ్చితంగా ప్రభావం చూపుతుంది. 'జన నాయగన్' సాధించే రికార్డులు ఎవరి ఊహకూ అందనంత స్థాయిలో ఉంటాయని ట్రేడ్ వర్గాలు జోస్యం చెబుతున్నాయి. పూజా హెగ్డే, బాబీ డియోల్, మమితా బైజు కీలక పాత్రలు పోషించిన ఈ సినిమాను హెచ్. వినోద్ తెరకెక్కించారు. అలాంటి 'జన నాయగన్' ఎలాంటి వండర్స్ క్రియేట్ చేస్తుందో తెలియాలంటే ఇంకా కొద్ది రోజులు వేచి చూడాలి.

## కెరీర్‌పై దృష్టి పెట్టడం వల్ల బంధాలు దూరం

# హీరోయిన్ అవికా గోర్



'బాలికా వధు' (తెలుగులో చిన్నారి పెళ్లి కూతురు) సీరియల్‌తో దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుని, పలు విజయవంతమైన తెలుగు చిత్రాల్లో నటించిన నటి అవిక గోర్.. ఒంటరితనంపై సోషల్ మీడియాలో ఓ భావోద్వేగ పోస్ట్ చేశారు. తన చుట్టూ ఎంతో మంది ఉన్నప్పటికీ తాను ఎదుర్కొంటున్న మానసిక ఒంటరితనం గురించి ఆమె పంచుకున్న మాటలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

"ఒంటరితనం అంటే ఎప్పుడూ ఒంటరిగా ఉండటం మాత్రమే కాదు. వంద మంది తెలిసినా, మనకు చోటెక్కడుందో తెలియకపోవడం కూడా ఒంటరితనమే" అని ఆమె తన పోస్ట్‌లో పేర్కొన్నారు. "ఇప్పటికే ఏర్పడిన స్నేహితుల బృందాల్లో చేరేందుకు ప్రయత్నించడం చాలా అలసటగా ఉంటుంది. కెరీర్‌కే నా జీవితాన్ని అంకితమిచ్చాను. కాలం గడిచేకొద్దీ బంధాలను నిలబెట్టుకోవడం ఎంత కష్టమో ఆలస్యంగా గ్రహించాను" అని ఆమె వివరించారు.

"ఇప్పుడు మనం స్నేహం కోసం సిద్ధంగా ఉన్నా, అప్పటికే అందరూ వారి సొంత గ్రూపులు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో అందరూ తెలిసినా, ఎక్కడికీ చెందని వారిలా మిగిలిపోతాం. నన్ను చేర్చుకోవడానికి ఎవరూ సిద్ధంగా లేరు" అని అవిక తన ఆవేదనను వ్యక్తం చేశారు.

కెరీర్‌కు అధిక ప్రాధాన్యత ఇవ్వడం వల్ల వ్యక్తిగత సంబంధాలు ఎలా ప్రభావితమవుతాయో అవిక మాటలు స్పష్టం చేస్తున్నాయి. చాలా మంది అనుభవించే ఇలాంటి భావాలను ఆమె ధైర్యంగా పంచుకోవడం గమనార్హం. ప్రస్తుతం ఆమె చేసిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.






# 'లెనిన్' వంద కోట్ల మార్కు దాటుతుంది: అఖిల్



అక్కినేని అఖిల్ హీరోగా నటించిన తాజా చిత్రం 'లెనిన్' బాక్సాఫీస్ వద్ద అద్భుతమైన విజయాన్ని నమోదు చేసింది. విడుదలైన తొలి మూడు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 61 కోట్లకు పైగా గ్రాస్ వసూలు చేసి, బ్లాక్‌బస్టర్ దిశగా దూసుకెళ్తోంది. అయితే, ఈ భారీ విజయంపై అఖిల్ అక్కినేని ఎంతో పరిణతితో స్పందించారు. తనకు దక్కిన ఆదరణ పట్ల కృతజ్ఞతగా ఉన్నప్పటికీ, అప్పుడే గాల్లో తేలిపోవడం లేదని, తన కాళ్లు ఇంకా నేల మీదే ఉన్నాయని స్పష్టం చేశారు. ఐఏఎన్ఎస్‌కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో అఖిల్ పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'లెనిన్' చిత్రం మూడు రోజుల్లోనే బ్రేక్ ఈవెన్ సాధించి, డిస్ట్రిబ్యూటర్లను లాభాల బాట పట్టించడం తనకు మాటల్లో చెప్పలేని సంతృప్తిని ఇచ్చిందన్నారు. "ఈ ఉదయం నా డిస్ట్రిబ్యూటర్ల నుంచి వచ్చిన మెసేజ్‌లు నాకు అత్యంత ఆనందాన్నిచ్చాయి. 'సార్, మా పెట్టుబడి వచ్చేసింది. ఈ రోజు నుంచి లాభాల్లోకి వెళుతున్నాం' అని వారు చెప్పారు. ఇది నాకు మాటల్లో చెప్పలేనంత శక్తిని, సంతృప్తిని ఇస్తోంది. వీకెండ్ ముగిసేలోపే నా వాళ్లంతా లాభాల్లో ఉన్నారు. నేను నా కుటుంబంతో సంతోషంగా ఉన్నాను, వారు వారి కుటుంబాలతో ఆనందంగా ఉన్నారు. ఇంతకంటే ఏం కావాలి!" అని అఖిల్ వివరించారు. సినిమా విజయంపై తండ్రి నాగార్జున స్పందన గురించి అడగ్గా, "ఈ విజయంపై నాన్న ప్రత్యేకంగా మాటలేమీ చెప్పలేదు. ఎంతో ఆప్యాయంగా ఆలింగనం చేసుకున్నారు. ఆ ఒక్క హగ్‌లోనే ఆయన చెప్పాలనుకున్నదంతా నాకు అర్థమైంది. ఆ ఒక్క అనుభూతి చాలు, పడిన కష్టమంతా మర్చిపోవడానికి!" అని అఖిల్ అన్నారు. తాము ప్రేక్షకుల కోసమే పనిచేస్తామని, వారి అభిమానాన్ని పొందినప్పుడు కలిగే అనుభూతి వెలకట్టలేనిదని అఖిల్ పేర్కొన్నారు. "మేము పనిచేసేది ప్రేక్షకుల కోసమే. వారు మా కంటెంట్‌ను ఆస్వాదించినప్పుడు, అంతకంటే నాకేం కావాలి? ఇది నాకు చాలా అనుకూలమైన పరిస్థితి. కానీ, అప్పుడే గాల్లో తేలిపోవడం లేదన్నారు.

Edited, Printed, Published & Owned by **LEKKALA SREENU** and Published from D.NO: 4-14/5-201, Revenue Ward NO. 57, Aganampudi, Near Toll Gate, Duvvada, Talarivanipalem,VISAKHAPATNAM, AP-530049 and Printed at **Guddapuvalasa Ramani**, D.No. 18-135/1/1, Opp. Apollo Hospital, Pedagadhili, VISAKHAPATNAM, A.P.-530040. E-mail: Pathakamnews.ap@gmail.com, **Mobile No: 7097975757, Reg No. APTEL/25/A2082**